జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 24 పక్షపత్రిక డిసెంబర్ 16-31, 2016




## పన్నులు మావి, సేవలు మాకే...
## నో సర్వీసెస్ - నో ట్యాక్స్

(ఊపందుకోవాలి "ట్యాక్స్ మనీ" రాజకీయం)

## అవినీతి నిరోధక చట్టసవరణ బిల్లును మార్చండి

ప్రధాని, ఎంపీలకు జేపీ లేఖ




ప్రొ. టి.వసంతరావు
సెల్: 93978 76970
08647-257597
శ్రీ విజయలక్ష్మి గాయత్రి
లేజర్ కలర్ ల్యాబ్ & జిరాక్స్
మా వద్ద 10ని.
కలర్ పాస్‌పోర్ట్ ఫోటోలు
తీసి ఇవ్వబడును.
జనరేటర్
సౌకర్యం కలదు
CD
SDXC Card
SanDisk
పెన్ డ్రైవ్
మెమోరీకార్డ్
సెల్ ఫోన్ నుండి
మా వద్ద లేజర్ ఫోటో ప్రింటింగ్ వేయబడును
అడ్రస్: భాస్కర్ థియేటర్ సెంటర్,టి.యస్.ఆర్ కాంప్లెక్స్,కో-ఆపరేటివ్ బ్యాంక్ క్రింద, చిలకలూరిపేట.

జన రాజకీయం కోసం...

**లోక్‌సత్తా టైమ్స్**

పక్షపత్రిక డిసెంబర్ 16-31, 2016

సంపుటి - 7 సంచిక - 24

## లోపలి పేజీల్లో...

పన్నులు మావి, సేవలు మాకే............. 5

నోట్ల రద్దు తొలి అడుగే..... ................11

నోట్ల రద్దు సర్వరోగనివారిణి కాదు...... 14

బాధిత ప్రజలనే శిక్షిస్తూ లంచగొండు.. 16

ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలి.... 18

అడుగులు వేద్దాం... అవినీతి రహిత..... 19

పార్లమెంట్‌లో రచ్చ - యూత్ ............ 20

రెవెన్యూ చట్టాలను ఆధునీకరించాలి... 22

తప్పయింది.. గురజాడను గౌరవిస్తాం.. 26

న్యాయమూర్తుల నియామకం ........... 27

భారత్‌లో ముస్లిం లా ఖురాన్........... 29

నీళ్లివ్వలేని శంకుస్థాపనలతో ............ 30

ఏపీకి ప్రత్యేక హోదాపై కేంద్రం మాట..... 32

పౌరసేవల చట్టం తేవాలి...దామాషా.. 33

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు


బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# జాన్ కీ!



డిసెంబర్ 6న తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత అకాల మరణం అంశంతోపాటు మరోవార్త మన పత్రికల అంతర్జాతీయ పేజీలో ఓ చిన్న కాలమ్‌గా ప్రచురితమైంది. అది న్యూజిలాండ్ ప్రధాని జాన్ కీ రాజీనామా! ఆయన ఎనిమిదేళ్లు ప్రధానిగా ప్రశంసనీయ సేవలు అందించారు. మరోసారి ప్రధానిగా తేలిగ్గా ఎన్నికయ్యే వాతావరణం ఉంది. అయినా స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఇక నుంచి భార్య బ్రనాగ్, పిల్లలు స్టెఫనీ, మాక్స్‌ల కోసం సమయం వెచ్చిస్తానని చెప్పారు. జాన్ కీ మాత్రమే కాదు, ఇలా ప్రజాదరణ ఉన్నప్పుడు తప్పుకోవటం పరిణతిగల ప్రజాస్వామిక దేశాలలో కనిపిస్తుంటుంది. పదవిలో బాధ్యతలు నెరవేర్చటానికి చాలా ఎక్కువ సమయం వెచ్చించాల్సి రావటం వల్ల స్వీడన్‌లాంటి దేశాల్లో మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలున్నాయి. అలాగే అమెరికాలో గతంలో విదేశాంగ శాఖ మంత్రిగా పనిచేసిన కండొలిజా రైస్‌ని ఈ ఏడాది ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి పోటీచేయమంటే సున్నితంగా తిరస్కరించారు. తనకు ఆ పదవికన్నా విద్యార్థులకు పాఠాలు చెప్పుకోవటం ఇష్టమన్నారామె. కానీ మనదేశంలో పరిస్థితి ఎంత వికృతంగా ఉందీ! అధికారం కోసం ఎంతకైనా బరితెగిస్తున్నారు. వయసు సహకరించకపోయినా, శరీరమంతా రోగగ్రస్తమయినా కుర్చీని పట్టుకుని వేలాడుతుంటారు. చచ్చేంతవరకూ తాము అధికారంలో ఉండాలి, తమ తర్వాత కుటుంబ సభ్యులు అధికారంలో కొనసాగాలని తహతహలాడుతుంటారు. అధికార లాలసతో ఉచ్ఛనీచాలు మరిచి మరీ ఎన్నికలలో నోటికొచ్చినట్టు మాట్లాడటం, ప్రజలను చులకనచేస్తూ కొనుగోలు చేయటం, జనం మధ్య చిచ్చుపెట్టటం, తమ పిల్లలు వేరు - ఇతరుల బిడ్డలు వేరు అనేరీతిలో భావితరాలకు అవకాశాలు అందించకుండా తాయిలాలతో ప్రజల్ని మత్తులో, నిరంతర పేదరికంలో కొనసాగించటం వంటి వాటికి పాల్పడుతుంటారు. ఇంత చేస్తున్నా.. మనదేశంలో ధన రాజకీయం చేసి జనాదరణ పొందిన నేతలను జన రాజకీయ నేతలుగా పొరబడేలా కీర్తించటం ఆనవాయితీగా మారింది. ధన రాజకీయ నేతలకు - నిజమైన జన రాజకీయ నేతలకు మధ్య తేడాని నిర్వచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జయలలితనే తీసుకుంటే.. ఆమె ధీర వనిత. ఎంతో కష్టపడి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. రాజకీయాలలో ఎమ్జీ రామచంద్రన్, ఎన్టీరామారావు కంటే కూడా ఆమె పడ్డ కష్టం ఎక్కువ. అలాగే ప్రజలకు చట్టబద్ధ పాలన, కొన్ని మౌలిక సేవలు సక్రమంగా అందేలా చేయటంలో ఆమె ఎంతో సమర్థత కనబరిచారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు హైదరాబాద్ అండలేని ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అడగకుండా ఓట్లు దండుకునేందుకు సమైక్యాంధ్ర ఉద్యమం చేసిన, చేయించిన నేతలను చూశాక.. తమిళనాడు ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేసిన జయలలిత ఎన్నో రెట్లు గొప్ప నాయకురాలని ఒప్పుకోవాల్సిందే. జయలలితకు వంశపారంపర్య రాజకీయాలు కూడా లేవు. కానీ మిగతావన్నిటిలో ఆమె కూడా సాంప్రదాయ రాజకీయమే చేశారు. ఈవేళ దేశాన్ని పట్టిపీడిస్తున్న.. అక్రమ ఆస్తుల్ని కూడగట్టుకోవటం, అధికారాన్ని కేంద్రీకరించటం, పార్టీని సొంత ఎస్టేట్‌లాగా తయారుచేసి ప్రజాప్రతినిధులకు సొంత అభిప్రాయాలు లేకుండా చేయటం, పదవిని పట్టుకుని వేలాడటం వంటి వైఫల్యాలన్నీ జయలలితలోనూ నరనరానా జీర్ణించుకుపోయాయి. ఆమెపై అక్రమాస్తుల కేసును ఎలా కొట్టివేశారన్నది ఇప్పటికీ ఒక మిస్టరీయే. పదవీ లాలస లేకుండా ఉంటే తన ఆరోగ్యసమస్యలకు తగిన చికిత్స తీసుకుని ఆమె హాయిగా బతికిఉండగలిగేవారు. కానీ అధికార మాయ కప్పేయటం వల్ల వాస్తవాల్ని ఆమె గుర్తించలేకపోయారు. అభివృద్ధి చెందిన ప్రజాస్వామిక దేశాలతో పోలిస్తే మనదేశంలో నాయకులు కొంత ఎక్కువ కాలం క్రియాశీల పాత్ర పోషించాల్సిన అవసరం ఉన్నమాట వాస్తవం. ఎంతో భిన్నత్వం, సంక్లిష్టతలు, పేదరికం, అవిద్య ఉన్న దేశంలో నాయకత్వం రూపుదిద్దుకోవటానికి చాలా సమయం పడుతుంది కాబట్టి భారత్‌లో ఈ అవసరం ఉంది. అలాగే కొన్ని భావజాలాల వ్యవస్థాపకులు అవి ఒక దశకు చేరుకుని ఫలితం ఇచ్చే వరకూ నాయకత్వం ఇవ్వాల్సి ఉంటుంది. పూర్వపు సోవియెట్ యూనియన్‌లో లెనిన్ బతికుంటే పరిస్థితి భిన్నంగా ఉండేదన్న భావన అందుకే కలుగుతుంటుంది. లెనిన్ కమ్యూనిజాన్నే కొనసాగించేవారా లేక వాస్తవాల్ని గుర్తించి పెట్టుబడిదారీ వ్యవస్థలోని మేలిమి అంశాల్ని కూడా మిళితం చేసుకుని ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థ దిశగా ప్రయాణించేవారా అనే వాదనల జోలికి ఇప్పుడు వెళ్లనక్కర్లేదు. కానీ వీటి అర్థం అధికారం చుట్టూనే రాజకీయం చేయటం కాదు. భావజాలాన్ని అందించటం, అందుకు తగ్గ వేదికను నిర్మించి అందుబాటులోకి తేవటం మాత్రమే నాయకుని ప్రధాన బాధ్యత. అది చెదరకుండా దీర్ఘకాలం పరిరక్షించటం కూడా అదనపు పనే. ఆ పనులన్నీ సమాజం చూసుకోవాల్సిందే. ధన రాజకీయాలకు లభిస్తున్న తాత్కాలిక ఆదరణను జన రాజకీయంగా భ్రమింప చేయకుండా.. సమర్థులు, నిజాయతీపరులు, ముఖ్యంగా యువత నాయకత్వ బాధ్యతల్ని అందుకునేలా, వీలున్నంతకాలం చేశాక తమ తర్వాతి తరానికి బాధ్యతల్ని బదిలీ చేసేలా రాజకీయ, పాలనా, ఎన్నికల వ్యవస్థల్ని మార్చే సంస్కరణల్ని తెచ్చుకోవటం ఇప్పుడు మన ముందున్న ప్రధాన లక్ష్యం.

మీ



# కార్టూన్ కార్నర్




కాంట్రాక్టరు గారు డబ్బు తెస్తే తీసుకుని మంచం కింద దాచిఉంచు, నేను అవినీతి నిరోధక దినోత్సవ మీటింగుకెళ్తున్నా.

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. **10** ,*
*ఏడాది చందా : రు. **200***
*మూడేళ్ళ చందా : రు. **500***

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు


| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# పన్నులు మావి, సేవలు మాకే.. నో సర్వీసెస్ - నో ట్యాక్స్

## (ఊపందుకోవాలీ 'ట్యాక్స్ మనీ' రాజకీయం)


*బ్యాంకుల్లో పెద్ద మొత్తాలను ఎగవేసినవారిపై, రాజకీయాలలో నల్లధనం ఉపయోగిస్తున్నవారిపై నేరుగా చర్యలు తీసుకునే సాహసాన్ని చేయలేక మోదీ ప్రభుత్వం డీమానిటైజేషన్ మార్గాన్ని ఎంచుకుంది. పరోక్షంగానైనా, ఈ మాత్రం ధైర్యాన్ని ప్రదర్శించినందుకు ఖచ్చితంగా మోదీని అభినందించాల్సిందే. ప్రభుత్వం ఆశించినట్టు లక్షల కోట్ల నల్లడబ్బు బైటపడుతుందో లేదోగానీ చీకటిపెట్టెల్లో మూలుగుతున్న లక్షల కోట్లు మాత్రం చెలామణిలోకి వస్తాయనుకోవచ్చు (నోట్ల రద్దు ముందే లీకై నవంబర్ 8కి కొంతమంది ముందుగానే చేసుకున్నారనుకుంటున్న డిపాజిట్లను కూడా కలుపుకుని). కనీసం డీమానిటైజేషన్ తర్వాతైనా మోదీ అవినీతిపరులపై, నల్లధనం రాజకీయంపై నేరుగా కఠిన చర్యలు తీసుకునే సాహసం చేయాలి. అవినీతి నిరోధక చట్టంలో లంచగొండులకే రక్షణ కల్పించే తప్పుడు సవరణల్ని తొలగించి, ఆస్తుల జప్తు వంటి ఏర్పాట్లతో పటిష్టం చేయాలి. ఎన్నికలలో డబ్బు ప్రభావాన్ని తగ్గించేందుకు దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణల్ని కూడా తేవాలి. వీటన్నిటినీ డీమానిటైజేషన్‌కి జోడిస్తే.. హేతుబద్ధ పన్నులు - పన్నుల డబ్బు సద్వినియోగం వ్యవస్థలో భాగంగా మారిపోతాయి, ప్రజలు పడ్డ నోట్ల కష్టాలకు సరైన ఫలితం దక్కుతుంది.*



'తమ పన్నుల డబ్బుకి– తమ ఓటుకి' మధ్య సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకుంటే తమ నిజమైన ప్రయోజనాలను, వాటిని సాధించగలిగిన విధానాలున్న నాయకుల్ని, పార్టీలను ఎన్నుకుంటారని దేశంలోనే కొత్త రాజకీయ ఉద్యమానికి నాంది పలికిన లోక్‌సత్తా ఓ పార్టీగా కూడా విస్తరించినప్పుడు .. "మీ భాష ప్రజలకు అర్థం కావటం లేదండీ, ఇలాగైతే గెలవరుగానీ పంథా మార్చుకుని మిగతా పార్టీల్లాగా కాస్త.." అని తలనెరిసిన ఓ జర్నలిస్టు పెద్దాయన సలహాలిస్తుండేవారు. సదుద్దేశంతోనే తప్ప లోక్‌సత్తాను దెబ్బతీయాలనే దురాలోచనేమీ ఆయనకు లేదు. లోక్‌సత్తా గెలిస్తే మనసారా ఆనందించే అనేకమందిలో ఆయనా ఒకరు. అలాగే.. లోక్‌సత్తాని గెలిపించేందుకు వృత్తినిపుణునిగా, పౌరునిగా తన వంతు ప్రయత్నం మాత్రం ఒక పరిధి దాటి చేయని అనేకమందిలో కూడా ఆయన ఒకరు! మనకు పార్టీకన్నా దేశ ప్రయోజనాలు ముఖ్యం, లోక్‌సత్తా లక్ష్యాల్ని వేగంగా సాధించేందుకు పార్టీగా ఎన్నికలలో పోటీకి తాత్కాలికంగా విరామమిచ్చయినా సరే వేరే మార్గాలుంటే వాటిని కూడా వినియోగించుకోవటానికి వెనుకాడకూడదన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వాదనల్ని ఆయన కాదనరుగానీ, పెద్దగా ఏకీభవించరు. తలనెరిసినా, ప్రింట్ మీడియా నుంచి వచ్చిన ఆయన టీవీ షోను నిర్వహిస్తుంటే, ఎంతో నైపుణ్యమున్న కుర్ర జర్నలిస్టులు కూడా తడబడాల్సిందే. సమకాలీన అంశాలను రోజువారీ వివరాలతో ఆయన మాట్లాడే తీరు పలువురు విశ్లేషకుల్ని సైతం తడుముకునేలా చేస్తుంది. అందుకే ఒక న్యూస్ ఛానల్‌లో రోజూ వచ్చే ఆయన షోకి క్రేజీ ఎలక్ట్రానిక్ మీడియా యుగంలో కూడా వీక్షకులు ఏర్పడ్డారు. అలాంటి జర్నలిస్టు పెద్దాయన

నోటి నుంచి ఈమధ్య తాను ఎన్నో ఏళ్లుగా చెబుతున్న మాటకి భిన్నమైన పలుకు వినిపించింది. ఆయన చాలాసార్లు రాజీపడుతుంటారుగానీ, ఈ విషయం మాత్రం కాస్త గుండెలోతుల్లో నుంచి చెప్పినది.

పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) పరిణామాలపై సీరియల్ చర్చల్లో వ్యాఖ్యానం చేస్తూ.. "డీమానిటైజేషన్ ద్వారా నగదు రహితంగా ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోందంటే పన్ను పరిధి పెరిగి ప్రభుత్వానికి ఆదాయం ఐదారు రెట్లు పెరుగుతాయంటున్నారు. మనం పన్నులు కడుతున్నది మనం ఎన్నుకున్నవారికే కాబట్టి, మన ప్రభుత్వానికి రాబడి పెరిగితే మనకు సంతోషమే. కానీ ఇప్పటివరకూ కట్టించుకుంటున్న పన్నులకు ప్రభుత్వం ఏం చేస్తోందండీ? మంచినీరు శుభ్రంగా అందదు, రోడ్లు అధ్వాన్నం, చెత్తకుప్పలు పేరుకుపోయి ఉంటాయి, ఆసుపత్రికి వెళ్తే దిక్కుండదు, మంచి చదువు, ఆరోగ్యం కావాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిందే, దయదలిచినట్టు చేసే సర్వీసులకు కూడా లంచాలు సమర్పించుకోవాల్సి ఉంటుంది.. ఇలా ప్రజల్ని వేధిస్తున్నవారు అందరినీ పన్నులు కట్టమంటే ఎలాగండీ? ఎందుకు కట్టాలి పన్నులు?" అని ఆ జర్నలిస్టు పెద్దాయన ప్రశ్నించారు.




**పౌరసేవల మెరుగుకా ! అవినీతి మేతకా**

పన్నుల డబ్బుకి–పౌరసత్వానికి–నాయకత్వానికి మధ్య సంబంధం నిజమైన ప్రజాస్వామిక రాజకీయానికి ఎంత కీలకమైనదో చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయినా ఆయన చాలా స్పష్టంగా తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఇదేతీరులో కొన్ని వెబ్‌సైట్లలో కూడా పన్నులకు తగ్గ సేవలపై చర్చలు వైరల్‌గా ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఇంకా ప్రభావితం చెయ్యాల్సుంది. 'గ్లాసులో నీరు 99 డిగ్రీల దాకా వచ్చినా వేడి తప్ప ఏమీ తేడా కనిపించదు, ఇంతకష్టమూ వృథా అన్న భావం కలుగుతుంటుంది, కానీ మిగిలిన ఒక్క డిగ్రీ కలిస్తే ఒక్కసారిగా ఆవిరి శక్తిగా మారుతుంది' అని జేపీ తరచూ చెప్పే మాటల్ని ఈ పరిణామాలు గుర్తుకుతెచ్చాయి. పన్ను డబ్బు విషయంలో మోదీ, మరో విషయంలో మరొకరో, మరో పరిణామమెవో ఆ ఒక్క డిగ్రీగా మారటం జరుగుతుంటుంది.


ఎట్టకేలకు పన్ను డబ్బు చుట్టూ రాజకీయం, సమాజంపై ప్రజల దృష్టి కొంత పడుతోంది. ఇది అనివార్యంగా ఇంకా పెరిగే దిశగానే వెళుతుంది అనటంలో సందేహం లేదు. కానీ 'ట్యాక్స్ మనీ' చుట్టూ రాజకీయంలో ప్రజలే గెలవాలంటే కొంత అవగాహన పెంచుకోవటం కూడా అవసరం. డీమానిటైజేషన్ పరిణామాల నుంచే ఈ పరిశీలన చేసుకోవాలి.

మనదేశంలో దాదాపు నాలుగోవంతు మంది అంటే 30కోట్లు స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. వీరందరూ తేలిగ్గా నగదు రహిత (నాన్–క్యాష్) ఆర్థిక లావాదేవీల్ని నిర్వహించేస్తారు. ఇన్ని స్మార్ట్ ఫోన్లు ఉండటం వల్లే 2016 ఏప్రిల్‌లో యునైటెడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సౌకర్యాన్ని రిజర్వుబ్యాంకు గవర్నర్ రఘురాం రాజన్ ప్రారంభించారు. వీటితోపాటు కార్డుల వాడకందారుల సంఖ్య కూడా వేగంగానే పెరుగుతోంది. డీమానిటైజేషన్‌కి ముందే.. డెబిట్ కార్డులు నవంబర్ 2015లో 623.67 మిలియన్ల నుంచి సెప్టెంబర్ 2016 నాటికి 39శాతం పెంపుతో 867.35 మిలియన్లకు పెరిగాయని రిజర్వుబ్యాంకు లెక్క చెబుతోంది. అలాగే ప్రీ పెయిడ్ ఎం–వాలెట్, పీపీఐ కార్డుల వంటివి 62.66 మిలియన్ల నుంచి 97.07కి పెరిగాయి (54.9శాతం పెరుగుదల). ఇప్పుడు ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేశాక (రూ.500,2000 నోట్లు తీసుకొచ్చారు, 1000నోటు మళ్లీ తెస్తామంటున్నారు కాబట్టి నోట్ల రద్దు కాదు, నోట్ల మార్పిడి మాత్రమే అనాలని

కొందరంటున్నా, పెద్ద నోట్లను ముున్ముందు రద్దు చేస్తామనే ప్రభుత్వం సంకేతాలిస్తోంది కాబట్టి ఆ చర్చ అనవసరం) నోట్ల వినియోగం తగ్గి ఆన్‌లైన్ లావాదేవీలు ఒక్కసారిగా పెరగాలని ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఆన్‌లైన్ లావాదేవీలు మూడునాలుగు రెట్లు పెరిగాయని కొందరు అంచనాలు వేస్తుంటే, 45 కోట్ల మంది ఇప్పటికే ప్లాస్టిక్ మనీ వాడుతున్నారని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ లెక్కచెబుతున్నారు. డిజిటల్ నగదు ఆర్థిక వ్యవస్థను ఇప్పుడున్న నగదు ఆర్థిక వ్యవస్థ స్థాయికి పెంచి, నగదు ఆర్థిక వ్యవస్థని ఇప్పుడున్న డిజిటల్ స్థాయికి దించాలన్నది స్థూలంగా ప్రభుత్వ ప్రయత్నం. నగదురహిత ఆర్థిక వ్యవస్థ ప్లాస్టిక్ మనీ ఉన్న స్వీడన్‌లో ఇంకా 20శాతం నగదు లావాదేవీలున్నాయి, కాబట్టి నూరుశాతం నగదురహితంగా దేశాన్ని మార్చాలని ప్రభుత్వానికి ఉన్నా.. అది ఆచరణలో సాధ్యం కాకపోవచ్చు.

మోదీ ప్రభుత్వం అరిసెల తయారీలా కంప్రెస్ చేయటం వల్ల దేశ జనాభాని ఆన్‌లైన్ దిశగా మళ్లించటం చాలామేర ఆరు నెలల్లోగానే పూర్తవుతుందని అంచనా. ఏడాదికల్లా అంతా ఒక కొలిక్కి వస్తుందను కుంటున్నారు. ఆధార్ రూపకర్త, టెక్నోక్రాట్ నందన్ నీలేకని అంచనా ప్రకారం, మూడేళ్ల సమయాన్ని మోదీ డీమానిటైజేషన్ షాక్‌తో కొన్ని నెలలకు కుదించే ప్రయత్నం చేస్తున్నారు. 2024కల్లా క్రెడిట్, డెబిట్ కార్డులు, ఏటీయం యంత్రాలు కూడా పోయి దాదాపు అంతా మొబైల్ ద్వారానే డిజిటల్ మనీ లావాదేవీలు చేస్తుంటారని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ అంటున్నారు. ఇక ఇంటర్‌నెట్‌తో అనుసంధానానికి అవకాశం లేని సాధారణ ఫీచర్‌ఫోన్లున్నా యూఎస్‌ఎస్‌డీ సాంకేతికతను ఉపయోగించి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తేవచ్చుని, అసలు మొబైళ్లు లేనివారు (వీరి సంఖ్య ఇప్పుడు దేశంలో 30కోట్ల వరకూ ఉంటుందని అంచనా) కూడా ఆధార్, మైక్రో ఏటీఎంల ద్వారా డిజిటల్ లావాదేవీలు చేసుకునే ఏర్పాటు చేయవచ్చుని నీలేకని చెబుతున్నారు. డిజిటల్ మనీ ఆర్థిక వ్యవస్థకు కావలసిన పునాది భారత్‌కు ఉందంటున్నారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించటంపై మార్గదర్శకాలను రూపొందించటానికి కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల సంఘానికి కూడా ప్రత్యేక ఆహ్వానితునిగా నీలేకని సలహాసూచనలు ఇస్తున్నారు. ఈ సంఘం అధ్యయనం చేసే అంశాలు ప్రధానంగా..

- డిజిటల్ చెల్లింపుల ఆధారిత ఆర్థిక వ్యవస్థను అమలుచేయటానికి ఇతర దేశాల్లో అమలులో ఉన్న మంచి విధానాలను గుర్తించి, వాటిని దేశ పరిస్థితులకు అనుగుణంగా అన్వయించటం
- ఒక ఏడాది వ్యవధిలో డెబిట్, క్రెడిట్, ప్రీపెయిడ్ కార్డులు, డిజిటల్ వాలెట్/ఈ వాలెట్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్, బ్యాంకింగ్ యాప్‌లను విస్తృతంగా పెంచటానికి వీలుగా కార్యాచరణ ప్రణాళికను సూచించటం
- వీటన్నింటినీ సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవటంతోపాటు, వీటి ద్వారా కలిగే ప్రయోజనాలను వారికి వివరించి, డిజిటల్ చెల్లింపుల వైపు మళ్లేలా చేయటానికి తగిన విధివిధానాలను రూపొందించటం
- వీటి అమలుకు రాష్ట్రాల్లో ఎలాంటి యంత్రాంగం అవసరముంటుందో మార్గసూచీ తయారుచేయటం
- డిజిటల్ చెల్లింపుల అమలులో ఎదురయ్యే అడ్డంకులను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను తయారుచేయటం
- డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయటంతోపాటు, వారి సూచనలకు అనుగుణంగా చర్యలు చేపట్టటం



- ఈ పనికోసం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ చేసే సూచనలను పరిగణలోకి తీసుకొని వాటికి తగిన రూపురేఖలు ఇవ్వటం
- ఈ సమస్యతో ముడిపడిన ఇతరత్రా అంశాల పరిశీలన

ఈ వ్యవహారమంతా తుపాకీతో కాల్చాక గురిచూసినట్టున్నా, ఇది ఇలాగే చేయాలా, ఇంకోలా చేయకూడదా, మోదీ విజయం సాధిస్తారా, నోట్ల రద్దు లేకుండా డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకాలు ఇస్తే చాలుగదా, అనే అనుమానాలున్నా.. ప్రస్తుతానికి ఆ చర్చ వల్ల ఉపయోగం లేదు. వదిలేసిన బాణంలా వెనక్కి తీసుకోవటానికి అవకాశంలేని ఈ డీమానిటైజేషన్ ద్వారా అనివార్యంగా పెరిగే పన్ను వసూళ్ల ద్వారా ప్రజాప్రయోజనాలను పెంచటానికి ఏం చేయాలన్నదే మనం దృష్టి సారించాల్సిన తక్షణాంశం.

**దేవుడి హుండీలోనైనా వేస్తున్నారుగానీ..**

మనదేశంలో ఏదో మాతృదేశాన్ని దేవతలా పూజించటం, అప్పుడప్పుడూ జెండా ఎగరేయటం, అసంకల్పిత గౌరవాన్ని కమాండ్ చేసే జాతి నిర్మాతలను ఆరాధించటం తప్ప ఈదేశం నాది, దేశం అభివృద్ధి చెందితే నేనూ అభివృద్ధి చెందుతాను అనే నమ్మకం చాలా తక్కువమందిలో కనిపిస్తుంది. కుటుంబ వ్యవస్థ, తరతరాల సంస్కృతీ సంప్రదాయాలలోని మేలిమి లక్షణాల వల్ల ఏదో బండి నడుస్తోందిగానీ, దేశంలో వ్యవహారాలు సక్రమంగా ఉండి కాదు. దేశాన్ని సక్రమమైన మార్గంలో పెట్టాల్సిన రాజకీయం, పాలనా వ్యవస్థ భ్రష్టు పట్టటంతో దేశంలోని అత్యధికులు వాటి పట్ల నిరాశానిస్పృహతో అయినకాడికి తాత్కాలికంగా దండుకోవటానికే ఓటును తాకట్టు పెట్టుకుంటున్నారు. కాస్త వనరులున్నవారు ఈ రాజకీయం, పాలనలోనే ఎలాగోలా పనిచేయించుకోగల సమర్థులు కాబట్టి వారికి ఇవేమీ పట్టటం లేదు. దేశ రాజకీయాల్ని విధానాలు, నైతికత ఉన్న ఉత్తమ వ్యాసంగంగా మార్చి సమర్థులు, నిజాయతీపరులు వచ్చేలా చేయకుంటే ఎప్పటికీ పరిస్థితి మారదని తెలిసినవారు సైతం మౌనం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దగ్గర తీసుకోవటమే తప్ప ప్రభుత్వానికి చెల్లించటమంటేనే ఏవగింపు దేశవ్యాప్తంగా కనిపిస్తుంటుంది. ఇదంతా సబ్బు బిళ్ల మీద, అగ్గిపుల్ల మీద మనం కట్టే పన్నుల డబ్బే.. మన సహ పౌరులు కట్టే ఆదాయపు పన్నో మరోటో లేదా మన వనరుల డబ్బే అన్నా ఎవరికీ పట్టటం లేదు. ప్రజల్లో ఉన్న ఈ అవగాహనారాహిత్యం, నిర్లక్ష్యం సాంప్రదాయ పార్టీలకు కూడా వాటంగా ఉండటంతో, దీన్నే ప్రోత్సహిస్తూ సంక్షేమం చుట్టూ అవినీతికి పాల్పడుతున్నారు. ఇక పన్నులు కట్టేవారు కూడా ప్రభుత్వం ఆ పన్నుల డబ్బుతో అందించే సేవలు అధ్వాన్నంగా ఉండటంతో వీలైనంత తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. 125 కోట్లమంది జనం ఉంటే 4.1శాతం మాత్రమే ఆదాయపు పన్ను రిటర్నులు, 1.3 కోట్ల మందే పన్నులు, వారిలోనూ గత్యంతరం లేని ఉద్యోగులే ఎక్కువ. దేవుడి హుండీలోనైనా వేస్తున్నారుగానీ పన్నులు కట్టటం లేదు.





**నో ట్యాక్స్ వాదనల వెనక సహేతుకత**

ప్రభుత్వానికి కట్టే పన్నులు చట్టబద్ధ దోపిడీ అని వారు సహేతుకంగానే గట్టిగా నమ్ముతున్నారు. ఉదాహరణకు ఓ మునిసిపాలిటీలో సేవలనే తీసుకోండి.

- తాగడానికి పనికొచ్చే మంచినీరు అందించటం మునిసిపాలిటీ విధి. కానీ ఎక్కడా శుద్ధి చేసిన మంచినీటికి గ్యారంటీ లేదు. పేదలు, సామాన్యులు ఈ నీళ్లే తాగి రోగాలు తెచ్చుకుంటున్నారు. వారికి ఆరోగ్యం అందించటానికి వ్యాధి ముదిరాక, కొందరికి, కొన్ని జబ్బులకే తూతూ మంత్రంగా వైద్యం చేస్తారు. ఆ నరకాన్ని తప్పించుకోవాలంటే ఆస్తులమ్ముకుని ప్రయివేటు వైద్యం

చేయించుకోవాలి. పన్ను కడుతూనే మరోపక్క చాలామంది నెలకి రూ.1000 డబ్బా మంచినీళ్లకు ఖర్చు పెడుతున్నారు.

- మెరుగైన పారిశుధ్యాన్ని అందించటం మునిసిపాలిటీ విధి. మురికికాల్వల నిర్వహణలో, చెత్తతొలగింపులో నిర్లక్ష్యం వల్ల పట్టణాలన్నీ అనారోగ్యం బారిన పడుతున్నాయి. అత్యధిక ప్రజలు దోమలతో సహజీవనం చేస్తూ రోగాలబారిన పడుతున్నారు. దోమల వల్ల జ్వరాల ఖర్చు అలావుంచితే కేవలం కాయిల్స్, మ్యాట్స్ వంటి వాటికోసం ఒక్కో ఇంటికి నెలకు రూ.150 వరకు ఖర్చవుతోంది. స్వచ్ఛ భారత్ పేరుతో ప్రచారం, ముక్కుపిండి పన్నులు వసూలు చేయటం తప్ప స్థానికంగా పరిస్థితులు మాత్రం బాగుపడలేదు.




- ఇవి కాకుండా మునిసిపల్ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వగైరాలు ప్రజల జేబులు ఖాళీ చేయటం తప్ప సేవలు అందించటం లేదు. కాలుష్యం సమస్య భయంకర సమస్యగా రోగాలను వ్యాపింపచేస్తోంది.
- ఇటీవల హైదరాబాద్‌లో భారీవర్షం పడితే రోడ్లు ఎంత అధ్వాన్నంగా తయారయ్యాయో, ఎన్ని నెలలపాటు ఆ నరకం కొనసాగిందో చెప్పనక్కర్లేదు.
- ప్రభుత్వ కార్యాలయానికి వెళితే ఎంత పన్ను కట్టినా లంచం ఇవ్వాల్సిందే స్థానికంగా అందాల్సిన రోజువారీ సేవలతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అందించాల్సిన సేవలూ అధ్వాన్నంగానే ఉంటున్నాయి. ప్రభుత్వాల మొట్టమొదటి కర్తవ్యమైన శాంతిభద్రతల పరిరక్షణ, చట్టబద్ధ పాలననే తీసుకుంటే.. భద్రతకు గ్యారంటీ లేని దేశాల జాబితాలో మనం ముందువరసలో ఉన్నాం.. మరి పన్నులు ఎందుకు కట్టాలి?

**ఎగవేత వెనక అవినీతి నాయకులు, అధికారులు**

ఇక దోపిడీ మార్గం ద్వారా డబ్బు సంపాదించి విధిగా పన్నులు కట్టాల్సిన వారి సంగతి సరేసరి. టన్నులకొద్దీ బంగారం, విలాసకార్లు కొంటున్నారుగానీ పన్నులు కట్టరు. వారి దొంగ ఎకౌంట్లకి, బినామీ ఆస్తులకి భూగోళం కూడా సరిపోవటం లేదు. వీరికి ఎన్నికల్లో డబ్బు వెదజల్లే రాజకీయ నాయకులు, లంచాల అధికారుల అండ ఉందని ఢంకా బజాయించి చెప్పొచ్చు. అందుకే.. ప్రత్యక్ష పన్నుల కేంద్ర విభాగం (సీబీడీటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆర్థిక నిఘా విభాగం (ఎఫ్ఐయూ), కేంద్ర ఎక్సయిజ్, కస్టమ్స్ బోర్డు, కేంద్ర ఆర్థిక నిఘా విభాగం (సీఈఐబీ), ఎన్‌సీబీ, ఎస్ఎఫ్ఐఓ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ), రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ (ఆర్ఓఎస్), ఇమిగ్రేషన్ బ్యూరో, ఆర్థిక నిఘా కౌన్సిళ్లు (ఈఐసీ), ఆర్థిక నిఘా మండలి, తీవ్రవాదానికి నిధుల నిరోధానికి, హవాలా లావాదేవీల నియంత్రణకు అంతర్ మంత్రిత్వ సమన్వయ కమిటీ (ఐఎంసీసీ), జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ), చట్టవ్యతిరేక కార్యకలాపాల దర్యాప్తు జాతీయ సంస్థ (ఎన్ఐఏ), రెవెన్యూ కార్యదర్శి సారథ్యంలో వివిధ దర్యాప్తు విభాగాల అధిపతులతో ఏర్పాటయ్యే అత్యున్నత స్థాయి కమిటీ, సీబీఐ, పోలీసులు, 1976లోనే వచ్చిన 'సఫీమ' (స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మ్యానిప్యులేటర్స్) చట్టం వంటివి ఉన్నా కూడా ఏటా రూ. 20-30లక్షల కోట్ల నల్లధనాన్ని నగదు, నగదేతర రూపాల్లో పోగేయగలుగుతున్నారు.

ఇప్పటికే స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఇవ్వకుండా చేపట్టిన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం పేరుతో రూ.10,000 కోట్ల అర్థంపర్థంలేని పరోక్ష పన్ను వసూలు చేస్తున్న పాలకులు ఇక ఆన్‌లైన్ లావాదేవీలు వచ్చాక భారీగా పన్నుల్ని (ఒకట్రెండు రకాల ట్యాక్సులే వున్నా) విస్తృతం చేస్తారనటంలో సందేహం లేదు.

ఎ) పన్నుల్ని కట్టేవారు ఇక కొన్ని పన్నుల్నే కాకుండా అన్ని పన్నుల్నీ కట్టాల్సొంటుంది. బంగారం మీద మోజును తగ్గించుకోవాలని ఎప్పటినుంచో లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తోందిగానీ, బంగారం సహా అన్నిటినీ పన్నుల కోసం ప్రభుత్వం వాడుకుంటుందనే విషయాన్ని విస్మరించలేం.

బి) పన్నులు కట్టకుండా దాటవేస్తున్నవారు కూడా ఇక అన్ని పన్నుల్నీ కట్టాల్సొంటుంది. ఇలా కొన్ని కోట్లమంది అదనంగా ప్రత్యక్ష పన్నుల పరిధిలోకి వస్తారు.

ఇలా.. కొందరు కొన్ని పన్నులు కట్టే దశ నుంచి అందరూ

అన్ని పన్నులూ కట్టే ఆర్థిక వ్యవస్థ ఏకపక్షంగానైనా చాలామేర అమల్లోకి రానుంది.

మరి ఈ పన్నుల డబ్బును కేంద్రం, రాష్ట్రాల పాలకులు తమ విలాసాల కోసం, ఉద్యోగుల జీతాల భారీ పెంపు కోసం వినియోగించకుండా మనకోసమే సద్వినియోగం చేయటానికి ఏం చేయాలి? ఏదోకరూపంలో పన్నులు కట్టకుండా తప్పించుకుంటే మళ్లీ నల్లధనం పోగవుతుంది కదా? ఏదోకాస్త పోపుల డబ్బాలోనో, ఇంకో నమ్మకమైన చోటో ఓ ఇల్లో, స్థలమో కొనుక్కుందామని ఏళ్ల తరబడి దాచుకుంటే నల్ల కుబేరులతోపాటు సామాన్య, మధ్యతరగతివారిని కూడా దొంగల్ని చూసినట్టు చూస్తే ఎట్లా? మన డబ్బు గురించి మనం పట్టించుకునే ఈక్రమంలో.. పన్ను డబ్బు దోపిడీ ఎలా ఉంటుంది, దానికి చెక్ పెట్టి మనం కట్టిన పన్నులకు తగ్గ సేవలను ఎలా పొందాలి అనే అంశాలను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుని ప్రజలు వ్యవహరిస్తుండాలి. వీటిని తేల్చుకుంటేనే డీమానిటైజేషన్‌లో జనం గెలవగలరు. భారత్ పునరుజ్జీవనంతో తన సామర్థ్యాన్ని వెలికితీసుకుని అగ్రస్థాయి అభివృద్ధిని అందుకోగలదు. ఇందుకోసం కచ్చితంగా పన్నులు, పన్నులకు తగ్గ సేవల చుట్టూ మన రాజకీయ ఆలోచనల్ని, భాగస్వామ్యాన్ని తిప్పాలి. తక్షణం ఈ పన్నుల సంస్కరణలకి డిమాండ్ చేయాలి.

- పన్నుల పరిధి పెరిగి రాబడి బాగా పెరుగుతుంది కాబట్టి ముందు పన్నుల్ని తగ్గించాలి
- పన్నులకు తగ్గ సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో.. పనుల్ని, ప్రమాణాల్ని, ఎంత సమయంలోగా ప్రజలకు ఆ పని చేసిపెడారో గడువుని చెబుతూ సిటిజన్ ఛార్టర్లను ప్రదర్శించాలి. కేవలం బోర్డులు పెట్టటవే కాదు, చట్టబద్ధంగా ఆ గడువులోగా అమలుచేయాలి, చేయకపోతే రోజుకు కనీసం రూ. 250 పరిహారం ప్రజలకు చెల్లించేలా 'పౌరసేవల చట్టం' (సర్వీస్ గ్యారంటీ)ని తీసుకురావాలి.
- స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో కూడిన అధికారాల్ని, నిధుల్ని ఇవ్వాలి
- రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రక్షాళన చేసి నగదు లావాదేవీలు లేకుండా చేయాలి. స్టాంప్ డ్యూటీని, ఇతరత్రా పన్నుల్ని తగ్గించి భూమి విలువను మార్కెట్ రేటుతో దాదాపు సమానంగా పెంచాలి.
- పన్నుల డబ్బును తాయిలాలకు పందేరం చేయకుండా ప్రజలకు నిజమైన అభివృద్ధిని, స్వతంత్ర జీవనాన్ని అందించే విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక వసతులు, ఆవిష్కరణలకే కేటాయించాలి. పన్నుల డబ్బుకు తగ్గ సేవలు సంతృప్తికరంగా అందుతున్నాయని ప్రజల నుంచి సంకేతం వచ్చాకే మరిన్ని సేవలకు ప్రజలు స్వచ్ఛందంగా ఎక్కువ పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలి.

బ్యాంకుల్లో పెద్ద మొత్తాలను ఎగవేసినవారిపై, రాజకీయాలలో నల్లధనం ఉపయోగిస్తున్నవారిపై నేరుగా చర్యలు తీసుకునే సాహసాన్ని చేయలేక మోదీ ప్రభుత్వం డీమానిటైజేషన్ మార్గాన్ని ఎంచుకుంది. పరోక్షంగానైనా, ఈ మాత్రం ధైర్యాన్ని ప్రదర్శించినందుకు ఖచ్చితంగా మోదీని అభినందించాల్సిందే. ప్రభుత్వం ఆశించినట్టు లక్షల కోట్ల నల్లడబ్బు బైటపడుతుందో లేదోగానీ చీకటి పెట్టెల్లో మూలుగుతున్న లక్షల కోట్లు మాత్రం చెలామణిలోకి వస్తాయనుకోవచ్చు (నోట్ల రద్దు ముందే లీకై నవంబర్ 8కి కొంతమంది ముందుగానే చేసుకున్నారనుకుంటున్న డిపాజిట్లను కూడా కలుపుకుని). కనీసం డీమానిటైజేషన్ తర్వాతైనా మోదీ అవినీతిపరులపై, నల్లధనం రాజకీయంపై కఠిన చర్యలు తీసుకునే సాహసం చేయాలి. అవినీతి నిరోధక చట్టంలో లంచగొండులకే రక్షణ కల్పించే తప్పుడు సవరణల్ని తొలగించి, ఆస్తుల జప్తు వంటి ఏర్పాట్లతో పటిష్టం చేయాలి. ఎన్నికలలో డబ్బు ప్రభావాన్ని తగ్గించేందుకు దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణల్ని కూడా తేవాలి. వీటన్నిటినీ డీమానిటైజేషన్‌కి జోడిస్తే.. హేతుబద్ధ పన్నులు – పన్నుల డబ్బు సద్వినియోగం వ్యవస్థలో భాగంగా మారిపోతాయి, ప్రజలు పడ్డ నోట్ల కష్టాలకు సరైన ఫలితం దక్కుతుంది.

కాబట్టి.. ఇప్పటిదాకా భవిష్యత్తు రాజకీయంగా ఉన్న 'ప్రజల పన్నుల డబ్బు – సద్వినియోగం'ను కొంతయినా వర్తమానంలోకి తేవటానికి డీమానిటైజేషన్ ఉపయోగపడుతోంది. ఈ ప్రభావాన్ని పూర్తిస్థాయిలోకి విస్తరించటానికి మన పన్నుల డబ్బుకి – మన ఓటుకి ఉన్న సంబంధాన్ని సమగ్రంగా గుర్తించటం అవసరం. పైన పేర్కొన్న పన్ను సంస్కరణల్ని వెంటనే సాధించుకోవటంతోపాటు.. 'పన్నులు మావి.. సేవలు మాకే', నో సర్వీసెస్ – నో ట్యాక్స్ అని సహాయ నిరాకరణ ఉద్యమాలు చేసైనా పన్నులకు తగ్గ సేవల్ని నిరంతరం పొందుతుండాలి.



# నోట్ల రద్దు తొలి అడుగే

**'ఈనాడు - ఈటీవీ' ముఖాముఖిలో లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్**

- ఎక్కువగా ఉన్నది స్థిరాస్తి రంగంలోనే
- అధికార, రాజకీయ అవినీతి అంతం కావాలి
- అవినీతి నిర్మూలనకు ప్రణాళికతో సాగాలి
- దేశ నిర్మాణంలో ఉపయోగపడని లక్షల కోట్లు
- సక్రమంగా వినియోగమైతేనే పన్నులకు సార్థకత
- రెండు వేల నోట్లు ఎందుకో వివరణ ఇవ్వాలి

*'పెద్ద నోట్ల రద్దు అనేది ఎన్నో ఏళ్ల తర్వాత దేశంలో నల్లధనాన్ని నివారించేందుకు వేసిన తొలి అడుగు. పన్నులు చెల్లించని మొత్తంపై ప్రయోగించిన మొదటి అస్త్రం. ఈ ఒక్క అడుగుతోనే ఇది ఆగిపోతే ఎంతమాత్రం ప్రయోజనం ఉండదు.. దేశ ప్రయోజనాల లక్ష్యం నెరవేరాలంటే మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని' జేపీ స్పష్టం చేశారు.*

*తదుపరి చర్యలు తీసుకోకుంటే ఫలితాలు ఎంతమాత్రం కన్పించకపోగా ఇదో నిరర్థకమైన ప్రక్రియగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఇదే జరిగితే ఇటువంటి చర్యల పట్ల ప్రజలు విశ్వాసం కోల్పేయే పరిస్థితి ఉందన్నారు. మన దేశంలో అత్యంత నల్లధనం ఉన్నది రియల్ ఎస్టేట్ రంగమని అభిప్రాయపడ్డారు. దీనికి తోడు అధికార యంత్రాంగం, రాజకీయ రంగాల్లో అవినీతితో నల్లధనం పెరుగుతోందన్నారు. ఈ మూడు రంగాల్లో నల్లధనం నివారణకు, అవినీతికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం రోడ్ మ్యాప్‌ను రూపొందించుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని 'ఈనాడు - ఈటీవీ'కి ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖిలో స్పష్టం చేశారు.*

(?) పెద్దనోట్ల రద్దుపై మీ అభిప్రాయం

జేపీ: నల్లధనం అంటే పన్ను చెల్లించని మొత్తం. దేశంలో 30లక్షల కోట్ల రూపాయల నల్లధనం ఉందని అంచనా. నల్లధనం రూపంలో లక్షల కోట్ల రూపాయలు జాతి నిర్మాణానికి ఉపయోగపడకుండా పోతున్నాయి. రియల్ ఎస్టేట్, అధికార యంత్రాంగం, రాజకీయ అవినీతితో నల్లధనం పెరిగిపోతోంది. ఈ మూడు రంగాలలో నల్లధనానికి అడ్డుకట్ట వేసేందుకు ముందుకు

## దేశంలో రూ.30లక్షల కోట్ల నల్లధనం

**(?) అధికార యంత్రాంగంలో నల్లధనం నివారణకు ఎలాంటి చర్యలు అవసరం**

పరిపాలనలో పారదర్శక విధానం అమలు చేయాలి. సిటిజన్ ఛార్టర్లు (పౌరసేవల చట్టం)ను పకడ్బందీగా అమలు చేయాలి. అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి. అవినీతి అధికారుల జాబితా ప్రభుత్వం వద్ద ఉంది. అత్యంత అవినీతిపరులైన వెయ్యిమంది అధికారులతో పదవీవిరమణ చేయించాలి.

వెళ్లకపోతే తొలి ప్రయత్నం ఫలాలు అందవు. ప్రజలు పడిన, పడుతున్న ఇబ్బందులకు సార్థకత ఉండదు. ఈ అడుగుతోనే ఈ బృహత్ కార్యక్రమం ఆగిపోకూడదు. నల్లధనం నివారణకు ప్రభుత్వం ముందుకు వెళ్తేనే లక్ష్యం నెరవేరుతుంది. సహజంగా ఇటువంటి చర్యలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతాయి. వీటికి ప్రభుత్వం సమర్థంగా అడ్డుకట్టవేయాలి.

**(?) నల్లధనం దేశానికి ఎలాంటి నష్టం కలిగిస్తోంది**

చీకటి మాటున జరిగే లావాదేవీలు దేశానికి మంచిది కాదు. దేశాభివృద్ధికి దోహదపడాల్సిన లక్షల కోట్ల రూపాయల డబ్బు నల్లధనం రూపంలో ఉండిపోవడం దేశ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దేశంలో జనాభా పెరుగుదల నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దమొత్తంలో నిధులు అవసరమవుతాయి. ప్రతి నెలా పది లక్షలమందికి కొత్తగా ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దఎత్తున పెట్టుబడులు

**రాజకీయ అవినీతికి అడ్డుకట్ట ఎలా?**

శాసనసభ, లోక్‌సభ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడం ద్వారా ఎన్నికల్లో నిజాయితీగా గెలిచే వ్యవస్థను నెలకొల్పాలి. ఓటు కొనుగోళ్ల వంటి వాటికి అడ్డుకట్ట పడాలి. ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకునే అవకాశం ఉండాలి. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఇవ్వాలి. డబ్బు అండతో అసమర్థులు, అవినీతిపరులు అధికారంలోకి వస్తే అసమర్థ పాలన వస్తుందని గుర్తించాలి. ప్రత్యక్ష ఎన్నికల విధానం ఉండాలి. దామాషా పద్ధతిలో జరిగితే కోట్ల రూపాయలు వ్యయం చేసే పరిస్థితి ఉండదు.

అవసరం. నల్లధనం రూపంలో ఉండిపోతున్న డబ్బు దేశ అవసరాలకు ఉపయోగపడటం లేదు. లక్షల కోట్లు జాతికి ఉపయోగపడకపోగా ఇతర రూపాల్లో వ్యయం చేస్తున్నారు. దేశానికి ఇది ఎంతమాత్రం మంచి పరిణామం కాదు.

**(?) స్థిరాస్తి రంగంలో నల్లధనం అత్యధికంగా ఎందుకు ఉంటోంది**

పన్ను చెల్లించకుండా చట్టం పరిధిలోకి రాకుండా లక్షల కోట్ల జాతి సంపదను కూడగట్టటం మంచిది కాదు. రియల్ ఎస్టేట్ రంగంలో అమ్మినపుడు, కొన్నపుడు కూడా డబ్బు రంగు మారుతోంది. సగటు మనిషి కూడా ఈ రంగంలో క్రయ విక్రయాలకు నల్లధనం బారిన పడాల్సి వస్తోంది. నిజాయితీగా సంపాదించుకున్న డబ్బును వేరే మార్గాల్లో ఇవ్వాల్సిన పరిస్థితి ఈ రంగంలో ఉంది. అవినీతి సొమ్ము వెచ్చించేందుకు ఇది ప్రధాన మార్గంగా ఉంది.

**(?) అధికార యంత్రాంగంలోని అవినీతి నల్లధనంగా ఎందుకు మారుతోంది**

దేశంలో లంచం ఇవ్వనిదే ఏ పని జరిగే పరిస్థితి లేదు. చిన్నచిన్న పనులకు కూడా ప్రజలు లంచాలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. పెద్దస్థాయిలో ప్రయోజనాల కోసం భారీ మొత్తంలో లంచాలు ఇస్తున్నారు. వాటి వలన వారు పొందే ప్రయోజనాలు అపరిమితంగా ఉంటున్నాయి. ఇదంతా నల్లధనంగా మారుతోంది.

**(?) రాజకీయ రంగంలో అవినీతి**

దేశంలో రాజకీయ రంగంలో అపరిమితమైన అవినీతి ఉంది. అసెంబ్లీ స్థానానికి ఎన్నికల్లో ఐదు కోట్ల నుంచి పది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కార్పొరేటర్ కూడా ఎన్నికల్లో రెండు మూడు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దేశం మొత్తం మీద ఒక దఫా ఎన్నికల్లో అభ్యర్థులు చేస్తున్న ఖర్చు లక్ష కోట్ల రూపాయల దాకా ఉంటోంది. గెలిచిన వాళ్లు ఖర్చు చేసిన మొత్తానికి 10 నుంచి 20 రెట్లు సంపాదించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటారు. ఇది రూ.10లక్షల కోట్ల నుంచి 15 లక్షల కోట్ల దాకా ఉంటోంది. భారతదేశ ఆదాయంలో ఇది చాలా పెద్ద మొత్తం.

**(?) రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఎలాంటి మార్పులు రావాలి**

ఈ రంగంలో పారదర్శక విధానాలు అవసరం. రిజిస్ట్రేషన్ పన్ను, క్యాపిటల్ గెయిన్స్ పన్నును తగ్గించాలి. పన్నులు ఎక్కువగా ఉండటం కూడా ఎగవేతకు ప్రధాన కారణమని గుర్తించాలి.

**(?) పన్ను ఎగవేతలకు కారణం ఏమిటి**

ప్రజలపై పన్నుల భారం తగ్గాలి. చెల్లించే పన్నుకు తగిన సేవలు అందితే పన్ను చెల్లించడానికి ముందుకు వస్తారు. పన్ను రూపంలో చెల్లించే మొత్తం సక్రమంగా వ్యయమవాలి. సద్వినియోగం కావాలి. అమెరికాలో 35శాతం, ఇంగ్లండ్‌లో 35 నుంచి 40శాతం పన్నులు తీసుకుంటూ అక్కడ ప్రభుత్వాలు అందిస్తున్న సేవలతో ప్రజలు సంతృప్తికరంగా ఉంటున్నారు. మన దేశంలో కూడా అటువంటి పరిస్థితి రావాలి. తాము చెల్లించేమొత్తం సరైన విధానంలో ప్రయోజనకరంగా ఖర్చవుతోందని భావిస్తే ప్రజలు పన్నులు చెల్లించడానికి ఇబ్బందులు పడరు. ఆ దేశాల్లో నాణ్యమైన విద్య అందుతోంది. మెరుగైన వైద్య వసతులు ఉన్నాయి. మన వద్ద ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందే పరిస్థితి లేదు.

**(?) అవినీతి అన్ని స్థాయుల్లో ఉంటోంది కదా..**

ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గం వందశాతం నిజాయితీతో ఉంది. దీన్ని ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఆరోపణలూ లేవు. ఇంతటితో సరిపోదు. ప్రభుత్వ రంగంలో అవినీతిని, రాజకీయ అవినీతిని పారదోలేందుకు పారదర్శక వ్యవస్థను తీసుకురావాలి. పెద్దస్థాయుల్లో అవినీతికి ముగింపు పలకాల్సిన అవసరం ఉంది.

**(?) రూ.2000 నోటుని తీసుకురావడంపై మీ అభిప్రాయం**

పెద్ద నోటుని రద్దు చేసి రూ.2000 నోటుని తీసుకురావడం పట్ల కేంద్రం వివరణ ఇవ్వాలి. ఎందుకు ఈ నోటు తెచ్చారనేది ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది.

**(?) ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మీ స్పందన**

ప్రభుత్వ చర్యలతో ప్రజలు ఇబ్బందిపడకూడదు. నోట్ల రద్దుకు ముందు కేంద్ర ప్రభుత్వం కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండేది. యంత్రాంగాన్ని ముందుగా సిద్ధం చేసుకుని ఉండాల్సింది.

# నోట్ల రద్దు సర్వరోగనివారిణి కాదు

- కూసంపూడి శ్రీనివాస్,
లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి

నల్లకుబేరులపై సర్జికల్ స్ట్రయిక్ అంటూ ప్రధాని మోదీ నవంబర్ 8న పెద్దనోట్ల రద్దుపై చేసిన ప్రకటన దేశంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. దాదాపు అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం చూపిన ఈ నిర్ణయంతో సామాన్య ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. నగదు మారకం ఒక్కసారిగా నిలిచిపోవటంతో ప్రజల కొనుగోలుశక్తి అనూహ్యంగా పడిపోయింది. ఇది నగదు చలామణిని తీవ్రంగా దెబ్బతీసింది.

దీనిపై ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో ఆందోళనలకు దిగినా ప్రభుత్వం మాత్రం నిర్ణయంపై వెనకడుగు వేసేది లేదని కరాఖండిగా చెప్పేసింది. అయితే ఈ ప్రకటన చేసిన ప్రధాని, రిజర్వుబ్యాంక్ గవర్నర్ ఉర్జిత్ పటేల్ స్పందన కొంత ఆశ్చర్యాన్ని కలగజేస్తున్నాయి. ఇవన్నీ పక్కనపెడితే అసలు ఈ నిర్ణయం మంచిదా, కాదా అన్నదానిపై ఎక్కడా చర్చ కూడా లేకుండా విమర్శల్ని తిప్పికొట్టేందుకు బీజేపీ అనుకూలవర్గాలు బరిలోకి దిగాయి. దేశభక్తిని తెరపైకి తెచ్చి మోదీ నిర్ణయాన్ని ప్రశ్నించేవారిని దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇదేవిధంగా గతంలో రాష్ట్ర విభజనకి ముందు జై తెలంగాణ అననివారిని తెలంగాణ ప్రాంతంలోనూ, జై సమైక్యాంధ్ర అననివారిని సీమాంధ్ర ప్రాంతంలోనూ ద్రోహులుగా చిత్రీకరించేవారు. ఆ సమయంలో తమ వ్యక్తిగత అభిప్రాయాలను కూడా ఎవరూ నిర్భయంగా చెప్పలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ సాంప్రదాయం దేశం మొత్తంలో వ్యాపింపచేయటానికి ఈ మధ్య పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ కూడా ఒక ఉదాహరణ. ఇప్పుడు మోదీ రూ.500, 1000 నోట్ల రద్దు ప్రకటనను వ్యతిరేకించే ప్రయత్నం చేస్తే హేతుబద్ధంగా ఎదుర్కోకుండా దేశభక్తి అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ నిర్ణయంపై సాంప్రదాయ పార్టీల స్పందన వెనక నిజాయతీ ఉందని చెప్పలేం. బీజేపీ, వారి మిత్రపక్షాలు సైతం మింగలేక, కక్కలేక మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. నోట్ల రద్దు నిర్ణయంపై వాస్తవాల్ని జాగ్రత్తగా గమనించటం అవసరం.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో 1948లో అప్పటి కేంద్ర మంత్రి కృష్ణ మీనన్ జీపులు, రైఫిళ్లు, బాంబర్లు, రక్షణ వాహనాల కొనుగోళ్లకు ఒక బోగస్ బ్రిటిష్ కంపెనీకి అడ్వాన్స్‌గా 80లక్షల రూపాయలు చెల్లించటంతో మొదలైన కుంభకోణాలు నిన్న మొన్నటి లక్షా అరవైవేల స్పెక్ట్రం కుంభకోణం దాకా అనేక రకాలుగా విస్తరించాయి. ఎంతవరకు వచ్చిందంటే, ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో చర్చించి పరిష్కరించాల్సిన ఎంపీలు ప్రజల తరపున సభలో ప్రశ్నలు అడగటానికి డబ్బు తీసుకునే నీచస్థితి దాకా.

మన పార్లమెంట్ సభ్యుల గురించి ఓహ్రా కమిటీ చెప్పిన వివరాల ప్రకారం రెండవసారి ఎన్నికైన ఎంపీల ఆస్తులు రెండువందల శాతం పెరిగాయి. ఒకప్పుడు నైతికతని డబ్బుతో కొలవటం ఉండేది కాదు. ఇప్పుడు లంచాలతో మాట్లాడుతున్నారు. మనదేశంలో అవినీతి, ప్రభుత్వం కవలల్లా తయారయ్యాయి. అటువంటప్పుడు నిజంగా ఈ నోట్ల రద్దుతో మనదేశంలో నల్లధనం, నకిలీనోట్లు అంతమొందుతాయి అనుకుంటే భ్రమే అవుతుంది. అలాగని ఈ నిర్ణయం వలన ఫలితాలు ఏమీ ఉండవని కాదు. దీనితో దొంగనోట్లకు, ఆర్థిక టెర్రరిజానికి, నల్లధనానికి కొంత బ్రేక్ వేయొచ్చు.

అంటే ఇది కేవలం సంస్కరణలకు ఆరంభమే తప్ప అంతం కాదు అని సుస్పష్టమవుతోంది. 'ఇప్పుడు నోట్ల రద్దుతో సామాన్యులు కష్టాలు పడుతున్నా, మరి యాభై రోజుల్లో ప్రక్షాళన జరుగుతుంది, మీరు కోరుకున్న భారత్‌ని మీకందిస్తాను' అని మోదీ ఉద్వేగంగా చెప్పినా.. అందుకు కావలసిన ఇతరత్రా చర్యల్ని, సంస్కరణల్ని ఆయనేమీ నిర్దిష్టంగా చెప్పలేకపోతున్నారు.

స్విట్జర్లాండ్ బ్యాంకర్స్ అసోసియేషన్ నివేదిక ప్రకారం 2008 నాటికే స్విస్ బ్యాంకుల్లో భారతీయులు దాచుకున్న


సొమ్ము 1.45 లక్షల కోట్ల డాలర్లు. దీనిని బట్టే నల్లధనం సమస్య తీవ్రత ఎంతో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల ముందు విదేశాలలో దాగివున్న నల్లధనాన్ని దేశంలోకి తిరిగి తీసుకువస్తానని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు జమచేస్తానని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ, ఆ తరువాత ఇన్‌కం డిక్లరేషన్ స్కీమ్ ప్రవేశపెట్టినా బయటపడింది కేవలం రూ.65వేల కోట్లే కావడంతో ప్రజల్ని ఏమార్చడానికి చేసిన ట్రిక్కుల్లో భాగమే ఈ నోట్ల నిషేధం అని కొంతమంది విమర్శిస్తున్నారు. ఇక నోట్ల రద్దు విషయానికొస్తే, ఈ విషయంపై దేశంలోని పెద్ద తలకాయలకు ముందుగానే ఉప్పందిందని, అందుకనే వారంతా ప్రశాంతంగా ఉన్నారని కొన్ని రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. మూడు వారాల కిందటే నల్లధనం అదుపు చేయాలంటే రూ.500, 1000 నోట్లు రద్దు చేయడం, డిజిటల్ లావాదేవీలు తీసుకురావడం లాంటివి తప్పనిసరి అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్పష్టమైన అభిప్రాయాన్ని లేఖ ద్వారా మోదీకి తెలియచేశారని, దానికి ప్రధాని ఆమోదం తెలిపారని తెలుగుదేశం వర్గాలు ప్రచారం చేసుకోవడం దీన్ని మరింత బలపరుస్తుంది. ఏదిఏమైనా ఈ నిర్ణయంతో సామాన్యులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. దళారుల చేతుల్లో మోసపోతున్నారు. అకస్మాత్తుగా అన్ని మతాల ప్రార్థనా మందిరాలకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. హుండీల ఆదాయం రెట్టింపయ్యింది. అయితే ముందే మనం చెప్పుకున్నట్టుగా ఈ నోట్ల రద్దు నల్లధనాన్ని, నకిలీనోట్లని అరికట్టడంలో ఒక ముందడుగేగానీ, మళ్లీ నల్లధనం పెరగకుండా చేస్తూ ప్రజలకు అవినీతిరహిత సమర్థపాలన అందించడానికి మాత్రం సరిపోదు. ఈ చర్య వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. కాబట్టి ప్రజలపై భారంగా ఉన్న పన్నులను తగ్గించడం, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులకు కేటాయింపులు పెంచడం, ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయడంలాంటి చర్యలు చేపట్టాలి. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో 'పౌరసేవల గ్యారంటీ చట్టం' లాంటి చర్యలు తీసుకురావాలి. అంతేతప్ప ప్రజల పన్నుల డబ్బును నాయకుల విలాసాలకు, ఉద్యోగుల జీతాలను భారీగా పెంచుకునేందుకు ఖర్చు చేస్తే ఉపయోగం ఉండదు. పన్నులు తగ్గితే నల్లడబ్బుకు ప్రధాన మూలాల్లో ఒకటైన రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో కూడా ప్రజలు స్వచ్ఛందంగా చెల్లింపులు వెల్లడిస్తారు. అలాకాకుండా మన రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లా ప్రజల పన్నుల సొమ్మును తమ కార్యాలయాలను కోట్లాది రూపాయలతో అలంకరించుకోవడానికి ఉపయోగించుకోవడం, ప్రతి చిన్నపనికీ ప్రత్యేక విమానాల్లో ప్రయాణించడం లాంటి వృథా ఖర్చులకు వెచ్చిస్తే జనం నుంచి తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతుంది. దేశాన్ని ప్రేమించే లోతైన ఆలోచనాపరుల సాయంతో పైన పేర్కొన్న సంస్కరణలన్నిటినీ వేగంగా చేస్తూ ఎన్నికల్లో అక్రమ సొమ్మును కట్టడి చేసే సంస్కరణని కూడా ఏకాభిప్రాయాన్ని కూడగట్టి తీసుకొస్తే పెద్ద నోట్ల రద్దును ప్రజలు దీర్ఘకాలంలో కూడా గొప్పగా చెప్పుకుంటారు. తాత్కాలిక పరిణామాలనేకాదు, ప్రభుత్వాలు తీసుకున్న వ్యవస్థీకృత నిర్ణయాలను, తాము పొందుతున్న ఫలితాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారనే సత్యం కూడా నాయకులు గ్రహించాలి.

## వియత్నాం సదస్సుకు లోక్‌సత్తా తెలంగాణ కార్యదర్శి జగన్ మెట్ల




ఎనిమిదవ ఇండో-వియత్నాం పీపుల్స్ ఫ్రెండ్‌షిప్ ఫెస్టివల్‌లో నగరానికి చెందిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి జగన్ మెట్ల పాల్గొన్నారు. డిసెంబర్ 2 నుంచి 7వరకు వియత్నాం రాజధాని హనోయ్‌లో జరిగిన ఈ ఫెస్టివల్‌కు వివిధ రాష్ట్రాల నుంచి 34మంది ఎంపికయ్యారు.

# ‘బాధిత ప్రజలనే శిక్షిస్తూ లంచగొండులను రక్షిస్తారా?’.. అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లును మార్చాలని ప్రధాని మోదీ, సోనియా, ఎంపీలకు జేపీ లేఖ




నల్లధనం, దాని చుట్టూ అల్లుకున్న అవినీతిని అంతం చేసేందుకు ఒకపక్క భారీ ప్రక్షాళన చర్యలు చేస్తున్నామంటూనే, మరోపక్క ఆ పోరాటాన్ని నీరుగార్చేలా సవరణలు ప్రతిపాదించిన అవినీతి నిరోధక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం బిల్లుగా పార్లమెంటు ముందుకు తెస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఇతర విపక్ష నేతలు, సంబంధిత మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా।। జయప్రకాష్ నారాయణ్ లేఖ రాశారు. ప్రభుత్వాధికారులపై అవినీతి ఆరోపణలు వచ్చినా ఉన్నతస్థాయి అనుమతి లేకుండా కనీసం దర్యాప్తు కూడా చేయకూడదు కానీ, వ్యవస్థ వైఫల్యానికి బలిపశువులై చిన్న ధ్రువపత్రం కోసం గతిలేక లంచం ఇచ్చినా సామాన్యుడికి క్రూరంగా కనీసం మూడేళ్ల జైలు శిక్ష ఉండాలని ఈ సవరణలు పేర్కొంటున్నాయన్నారు. బాధిత ప్రజలకు శిక్ష – లంచగొండులకు రక్ష అన్నట్టున్న ఈ సవరణల్ని మార్చాలంటూ కొన్ని సూచనల్ని తన లేఖలో చేశారు.

అవినీతి నిరోధక చట్టం, 1988కి కొత్తగా ప్రతిపాదించిన 17 ‘ఎ’ సెక్షన్ వల్ల దేశంలోని దాదాపు 2 కోట్ల మంది ప్రభుత్వోద్యోగులను దర్యాప్తు చేయాలంటే లోక్‌పాల్ లేదా రాష్ట్రాల స్థాయిలో లోకాయుక్త అనుమతి తీసుకోవాల్సుంటుందని జేపీ తన లేఖలో తెలిపారు. “చట్టం ముందు అందరూ సమానమే. అవినీతి ఆరోపణలో ప్రభుత్వాధికారులకదర్యాప్తునకు ప్రత్యేక అనుమతి అక్కర్లేదు” అని మే, 2014లో ఇచ్చిన తీర్పులో స్పష్టంగా పేర్కొంటూ ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 6 ‘ఎ’ని సుప్రీంకోర్టు కొట్టివేసినా మళ్లీ ఈ సవరణని ప్రతిపాదించారన్నారు.

విధానపరమైన నిర్ణయాలలో సదుద్దేశంతో పొరపాట్లు చేసిన ప్రభుత్వాధికారులను కచ్చితంగా రక్షించాల్సిందేనని, అయితే అందరు ప్రభుత్వోద్యోగులకూ, అన్ని అవినీతి ఆరోపణలలో రక్షణ కల్పిస్తామనటం రాజ్యాంగ విరుద్ధమని, లోక్‌పాల్, లోకాయుక్తలు గుమాస్తా పనిభారంతో నిర్వీర్యమైపోతాయని అన్నారు. మరోవైపు, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా అందాల్సిన జనన ధ్రువపత్రాలు, తాగునీటి కనెక్షన్, పట్టాదారు పాసుపుస్తకం, విద్యుత్తు అవసరాలు, భూముల రికార్డులు వంటి వాటికి గతిలేక ప్రజలు లంచం ఇస్తామనటాన్ని కూడా నేరంగా నిర్వచించా రన్నారు. ఈ సేవలకు లంచాలిచ్చిన సామాన్యులకు కనీసం మూడేళ్ల కారాగార శిక్షను విధించేలా సెక్షన్ 8 పేరుతో సవరణ ప్రతిపాదించారన్నారు. హక్కుగా రావాల్సిన సేవలకు బలవంతపు లంచం ఇవ్వటానికి, లాలూచీ పడి దేశానికి నష్టం వచ్చే పనులకు లంచం ఇవ్వటానికి మౌలికమైన తేడాను ఇందులో ఏమాత్రం గుర్తించలేదన్నారు.

సామాన్య ప్రజలను శిక్షించేలా, అవినీతిని పెంచి పోషించేలా తయారుచేసిన అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు, 2013లో ఈ దిగువ దిద్దుబాట్లు చేయాలని జేపీ సూచించారు:

1) అన్ని రకాల ఆరోపణలపై అందరు ప్రభుత్వోద్యోగులకు రక్షణ కల్పించే 17 'ఎ' సవరణను తొలగించి, ప్రభుత్వ స్థాయిలో విధాన సిఫార్సులు, నిర్ణయాలకు సంబంధించిన అంశాలలో మాత్రమే ముందస్తు అనుమతి నిబంధనను ఏర్పాటు చేయాలి.
2) లాలూచీ అవినీతికి – గతిలేక లంచం ఇవ్వటానికి మధ్య తేడాని స్పష్టంగా నిర్వచించాలి.
3) గత్యంతరంలేక బలవంతంగా లంచాలిచ్చే వారికి రక్షణ కల్పించటంతోపాటు అవినీతికి పాల్పడ్డ అధికారులను శిక్షించేలా న్యాయమైన నిబంధనలను ప్రవేశపెట్టాలి.

అవినీతి నిరోధక చట్టాన్ని, వ్యవస్థల్ని బలోపేతం చేసేందుకు ఈ దిద్దుబాట్లను చేపట్టాలని విజ్ఞప్తి చేస్తూ సంబంధిత అంశాలను వివరించే నోట్‌ను కూడా తన లేఖకు జత చేసి జయప్రకాష్ నారాయణ్ కేంద్ర ప్రభుత్వానికి, పార్టీలకు, ఎంపీలకు పంపారు.

## ఎస్.కె సిన్హాకు లోక్‌సత్తా శ్రద్ధాంజలి



లెఫ్టినెంట్ జనరల్ ఎస్.కె సిన్హా మృతి మన ప్రజాజీవితంలో పెద్దలోటని జేపీ శ్రద్ధాంజలి ఘటించారు. ఒక గొప్ప సైనికుడ్ని, ఆలోచనాపరుడ్ని, విద్వత్తుగల రాజనీతిజ్ఞుడ్ని, జాతి నిర్మాతని దేశం కోల్పోయిందన్నారు.




## పోల్చలేని అసమాన స్థాయి బాలమురళిది

కర్ణాటక సంగీతంలో ఏడు దశాబ్దాల కృషీవలుడు బాలమురళీకృష్ణ ఇంకకరితో పోల్చలేని అసమాన స్థాయిని అందుకున్న దిగ్గజమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ నివాళు లర్పించారు. తన రంగంలో అత్యుత్తమ ప్రతిభకు ఆయన సంకేతంగా నిలిచారన్నారు.

# ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలి



పెద్ద నోట్లు రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నల్లధనాన్ని, నకిలీ నోట్లని నిరోధించటంలో ఒక ముందడుగేగానీ, మళ్లీ అవి పోగు పడకుండా, అవినీతి జరగకుండా ప్రజలకు సమర్థ పాలన అందించటానికి మాత్రం సరిపోదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం అన్నారు.

*పన్నులకు తగ్గ నాణ్యమైన సేవలను పౌరసేవల చట్టంతో అమలు చేస్తే, ఆ సేవలలో ప్రజలకు పనికొచ్చే విద్య, ఆరోగ్యం కూడా చేరిస్తే దాదాపు ప్రజలంతా స్వచ్ఛందంగా పన్నులు కడతారన్నారు. రాజకీయ, పాలనా ప్రమాణాలు ఒకస్థాయికి చేరుకున్నాక పన్నులు పెంచినా ప్రజలు మనస్ఫూర్తిగా సహకరిస్తారన్నారు. అవినీతి నిరోధక చట్టానికి ప్రతిపాదించిన సవరణల్లో.. బాధిత ప్రజలనే శిక్షార్హులు చేస్తూ, లంచగొండి ఆరోపణల మీద ప్రభుత్వోద్యోగులపై పోలీసు దర్యాప్తు చేయటానికి కూడా పైనుంచి పర్మిషన్ కావాలనటం అవినీతిపై పోరాటాన్ని దెబ్బతీయటమేనన్నారు.*

తిరుపతి లోక్‌సత్తా కార్యాలయంలో నిర్వహించిన క్రియాశీలక సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ, ఇది సంస్కరణలకు ఆరంభమే తప్ప అంతం కాదని ప్రభుత్వాలు గుర్తెరగాలని బాలసుబ్రమణ్యం అన్నారు. సొంత పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల్లో పలువురు నల్లడబ్బు ఖర్చు పెట్టి ఎన్నికైనా, ప్రధాని నరేంద్ర మోదీ ఇంత సాహసోపేతంగా వ్యవహరించటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. అయితే దీన్నో డ్రామాలాగా అమలు చేయటం వల్ల ప్రజలు నానాఇక్కట్లు పడుతున్నారన్నారు. ఇది రాజకీయ డ్రామాలాగా మిగిలిపోకుండా ఉండాలంటే.. ప్రధానంగా ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్నారు. అలాగే పన్నుల ఆదాయం పెరుగుతుంది కాబట్టి పన్నుల్ని తగ్గించాలన్నారు. పన్నులకు తగ్గ నాణ్యమైన సేవలను పౌరసేవల చట్టంతో అమలు చేస్తే, ఆ సేవలలో ప్రజలకు పనికొచ్చే విద్య, ఆరోగ్యం కూడా చేరిస్తే దాదాపు ప్రజలంతా స్వచ్ఛందంగా పన్నులు కడతారన్నారు. రాజకీయ, పాలనా ప్రమాణాలు ఒకస్థాయికి చేరుకున్నాక పన్నులు పెంచినా ప్రజలు మనస్ఫూర్తిగా సహకరిస్తారన్నారు. అవినీతి నిరోధక చట్టానికి ప్రతిపాదించిన సవరణల్లో.. బాధిత ప్రజలనే శిక్షార్హులు చేస్తూ, లంచగొండి ఆరోపణల మీద ప్రభుత్వోద్యోగులపై పోలీసు దర్యాప్తు చేయటానికి కూడా పైనుంచి పర్మిషన్ కావాలనటం అవినీతిపై పోరాటాన్ని దెబ్బతీయటమేనన్నారు. అందుకే వెంటనే సవరణల్ని వెనక్కితీసుకుని, దర్యాప్తు సంస్థలకు జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తి, ఆస్తులను జప్తు చేసే ఏర్పాటుతోపాటు లోకాయుక్తల్ని బలోపేతం చేయాలన్నారు. ఇతర దేశాల్లో ఆస్తుల రూపంలో నల్లధనాన్ని దాచుకున్నవారి భరతం పట్టటానికి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నోట్ల రద్దు వల్ల వివిధ రంగాల్లో అసంఘటిత ఉపాధిని పొందుతున్న కోట్లాదిమంది సామాన్యులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రాష్ట్రాల ఆదాయం పడిపోయిందని, ప్రతికూల ద్రవ్యోల్బణం ప్రమాదాన్ని అధిగమించి నగదు చలామణి తిరిగి ఊపందుకునేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో తిరుపతి నియోజకవర్గం లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, గోపి, హేమాద్రి, మునిరత్నం తదితర నేతలు పాల్గొన్నారు.

# అడుగులు వేద్దాం.. అవినీతిరహిత సమాజం దిశగా !

**- అన్నపూర్ణ,** హైదరాబాద్

ఈ ఏడాది నవంబర్ 8వ తేదీ రాత్రి రెండు వార్తలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆశ్చర్య ఆనంద (కొందరికి విషాద)కరమైన సంచలనాలుగా ముంచెత్తాయి. మీడియా ఎలుగెత్తి చాటిన సర్వేలకు వ్యతిరేకంగా డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవడం, రెండవది, మనదేశ ప్రధాని నరేంద్ర మోదీ రూ.500, 1000 నోట్లను రద్దు చేసి కొత్తగా 500, 1000 నోట్లను ప్రవేశపెట్టటం!

ట్రంప్ గురించి చెప్పాలంటే, అమెరికా పౌరులకు ఉద్యోగ భద్రత హామీ, నాన్ ఇమ్మిగ్రెంట్స్‌ని వెనక్కి పంపించటం, ముస్లిమ్ తీవ్రవాదంపై తీవ్ర వ్యతిరేకత– ఇలా కొన్ని అంశాలు ప్రజలలో ఆశలు రేకెత్తించటం వల్ల పట్టం కట్టారు. మరోవిషయం– ఏ పార్టీ వరుసగా మూడోసారి అధికారాన్ని హస్తగతం చేసుకోలేదు. ఇది కూడా ట్రంప్‌కు దోహదకారి. హిల్లరీ ఎంతగా కష్టపడినా అవకాశం దక్కలేదు.

ప్రధాని మోదీ నిజానికి ఆరునెలలుగా ఒక్కో అంశాన్నీ ప్రజలకు చెబుతూనే ఉన్నారు. కానీ వాటిని పార్టీలు, అత్యధిక ప్రజానీకం సరిగా డీకోడ్ చేయలేకపోయారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పెద్దనోట్లను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరినా విని వదిలేశారు. నవంబర్ 8 రాత్రి గం॥8.30కి మోదీ ప్రకటించగానే అగ్రరాజ్యం అమెరికా ఎన్నికల ఫలితాల గొడవలో ఎలా రిసీవ్ చేసుకోవాలో అర్థం కాలేదు. దిశానిర్దేశం కోసం లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ట్వీట్లు చూస్తే, మోదీ ప్రసంగం కొనసాగుతున్నప్పుడే స్పందన వచ్చేసింది. మంచో చెడో ఇది మంచి దిశగానే ఉపయోగపడుతుందని కన్విన్స్ అవగలిగాం. సామాన్య మధ్యతరగతి ప్రజలలో అత్యధికులు కూడా ఇలాగే మోదీని మెచ్చుకున్నారు. ఈ పెద్ద నోట్ల రద్దు వెనకాల నల్లధనం వెలికితీయడం, దొంగనోట్లను గుర్తించడం వగైరా కారణాలున్నాయని గ్రహించారు. చాలామేర నిజాయతీగా పన్నులు చెల్లించేది మధ్యతరగతి ప్రజలే! వారి దగ్గర కేజీల కొద్దీ బంగారం నిల్వలుగానీ నల్లధనంగానీ పోగుపడదు. స్వంత ఇంటిని అమర్చుకోవడం, పిల్లల చదువులు, పెళ్లిళ్లు నిర్వహించుకోగల అవకాశం వస్తే చాలనుకుంటారు. కనుక పెద్దనోట్ల రద్దు సమస్యలు పెద్దగా ఉండవు. రియల్ ఎస్టేట్ రంగంలో తమ తప్పులేకపోయినా లెక్కలు చూపని నగదును వారు ఇస్తున్నారంటే అది దశాబ్దాలుగా ప్రభుత్వాల అసమర్థత వల్లే. ఇలా కొందరు అమ్మకాలు, కొనుగోళ్లకు క్యాష్ డ్రా చేసుకుని దాచుకుని ఉంటే, వారికి మాత్రం ఊరట ఏదోకరూపంలో లభించేలా చూడాలి. కొంత పొదుపు, నిరాడంబరత ఉంటే పట్టణ ప్రాంతాల్లో చాలా మేర సమస్యను అధిగమించవచ్చు. అలాగే ఆన్‌లైన్ లావాదేవీలను అలవాటు చేసుకుంటే ధోకా ఉండదు. కానీ గ్రామీణ ప్రజలలో చాలా గందరగోళం ఏర్పడింది. అమలులో వైఫల్యం వల్ల మంచి నిర్ణయం కూడా గందరగోళాన్ని ఎదుర్కొంటోంది. పర్యవసానాలు ఏవైనా దారితీయొచ్చనే అంచనాలకూ దారితీస్తోంది. చదువుకున్న యువత కూడా మోదీ చర్యను స్వాగతిస్తున్నా, పెద్ద నోట్ల రద్దును వెనక్కితీసుకునే అవకాశం లేకున్నా క్యూల్లో సమస్యల్ని, ప్రజల్లో భయాందోళనల్ని మరింతగా ప్రేరేపించేలా కొన్ని పార్టీలు, సంఘాలు వ్యవహరిస్తున్నాయి. ఇక రోజూ డబ్బు డ్రా కోసం క్యూల్లో నిలబడినవారిలో నల్లధనం యజమానుల బినామీలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారని మరువకూడదు. సరే, తెలంగాణ ఉద్యమం సహా అన్నిటా కష్టాల తర్వాతే ఫలాలు వచ్చాయి. ఓర్చుకుంటే క్రమంగా సర్దుకునే అవకాశం నోట్ల రద్దు విషయంలో కూడా వాస్తవమయ్యే అవకాశం ఉంది. కానీ అంత నష్టం జరిగాక నల్లధనం, నకిలీనోట్లు మళ్లీ రాకుండా ఉంటాయా? మోదీ ప్రసంగంలో ఆర్తి, సదుద్దేశం, దృఢసంకల్పం ఉన్నాయి. కానీ కేవలం నోట్ల రద్దుకే పరిమితమైతే వాటి వల్ల పెద్దగా ఫలితం ఉండదు. ప్రజలు ఇష్టపూర్వకంగా పన్నులు చెల్లించేందుకు, రియల్ ఎస్టేట్ రంగంలో దొంగచాటుగా డబ్బు ఇవ్వకుండా ఉండేందుకు, ఎన్నికలలో అక్రమ డబ్బు ఖర్చు చేయకుండా ఉండేందుకు ఆయన ఇతర సంస్కరణల్ని కూడా తీసుకురావాలి. జేపీ ఇప్పటికే ఆ సూచనల్ని అందించారు. లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన స్పెక్ట్రం, బొగ్గు గనుల వేలం వంటి విషయాల్లో వేగంగా స్పందించి జేపీ సలహాల్ని ఆచరణలో పెట్టిన మోదీ నోట్ల రద్దుకు కొనసాగింపు సంస్కరణల విషయంలో కూడా సానుకూలంగా, నిర్మాణాత్మకంగా స్పందించాలి. ఆ ఆశాభావంతోనే ప్రధాని సదుద్దేశానికి మద్దతిద్దాం, అవినీతిరహిత భారత్ సాకారమై ప్రజల డబ్బు వారి మంచినీరు, విద్యుత్తు, ఇతర సేవలు, విద్య, ఆరోగ్యం వంటి వాటిని సక్రమంగా ఉపయోగపడతాయని ఆశిద్దాం. ❧

# 'పార్లమెంట్‌లో రచ్చ - యూత్ పార్లమెంట్‌లో చర్చ'

## సామాన్య, మధ్యతరగతి దాచుకున్న డబ్బు నల్లధనం కాదు : జేపీ




*విదేశాల్లోని నల్లధనాన్ని తెప్పించటాన్ని వేరే అంశంగా చూడాలని, అది అంత సులభమైన అంశం కాదని జేపీ స్పష్టం చేశారు. డాలర్ పవర్ ఉన్న అమెరికాలాంటి దేశం కూడా ఈ విషయంలో ఒక పరిధిదాటి ఫలితాలు సాధించలేదన్నారు. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. విదేశాలకు తరలివెళ్లిన డబ్బును రప్పించే ప్రయత్నాలు చేస్తూనే, అంతకంటే ముఖ్యంగా మనదేశం నుంచి ఇక ముందు నల్లధనం తరలివెళ్లకుండా చూసుకోవాలన్నారు. పెద్ద నోట్ల రద్దుతో సమస్యలన్నిటికీ పరిష్కారం లభించదని గుర్తించాలన్నారు. నల్లధనం, దాన్ని అల్లుకుని ఉన్న అవినీతిని మనదేశంలో అంతం చేయడానికి సింగిల్ ఫార్ములా లేదన్నారు. ఇందుకోసం దేశీయంగా నల్లధనం పోగుపడకుండా, అవినీతి కొనసాగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో సంస్కరణల్ని చేపట్టాలన్నారు.*

పెద్ద నోట్ల రద్దుపై ప్రజల సమస్యలను పరిష్కరించటానికి, నల్లధనం పోవటానికి ప్రధాని తప్పుల్ని ఎండగడుతూ పనికొచ్చే రోడ్‌మ్యాప్‌ను అందించకుండా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పార్లమెంట్‌ను స్తంభింపచేస్తుంటే.. ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), పీపుల్ అగనెస్ట్ కరప్షన్ (పీఏసీ), జాగృతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన యూత్ పార్లమెంట్ 2016 నిర్మాణాత్మక చర్చతో స్పష్టమైన పరిష్కార మార్గసూచీని అందించింది.

'నల్లధనం, అవినీతి, ప్రజల పన్నుల డబ్బు'పై హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తి, హెచ్‌ఎంటీవీ చీఫ్ ఎడిటర్ వెంకటకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పి.సుబ్బారెడ్డి, లోక్‌సత్తా బండారు రామ్మోహనరావు, పి. భాస్కరరావు, సినీ హీరో వంశీ తదితరులు పాల్గొని దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వాల పట్ల నమ్మకం లేక, లావాదేవీల్లో నగదు వాడక తప్పనిపరిస్థితులుండటం వల్ల లెక్కలు చూపని డబ్బు సామాన్య, మధ్యతరగతి ప్రజల వద్ద కూడా ఉంటుందని, దీన్ని నల్లడబ్బుగా, ఆ ప్రజల్ని దొంగలుగా చూడటం సరికాదని జేపీ అన్నారు. "డబ్బు అంతా నల్లధనం కాదు. మధ్యతరగతి, పేద ప్రజలు, రైతులు, చిరు వ్యాపారులు జీవితాంతం దాచుకున్నది కూడా ఉంటుంది. గతిలేకనే సామాన్య ప్రజలు లంచాలు ఇస్తున్నారు" అన్నారు.

విదేశాల్లోని నల్లధనాన్ని తెప్పించటాన్ని వేరే అంశంగా చూడాలని, అది అంత సులభమైన అంశం కాదని జేపీ స్పష్టం

చేశారు. డాలర్ పవర్ ఉన్న అమెరికాలాంటి దేశం కూడా ఈ విషయంలో ఒక పరిధిదాటి ఫలితాలు సాధించలేదన్నారు. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. విదేశాలకు తరలివెళ్లిన డబ్బును రప్పించే ప్రయత్నాలు చేస్తూనే, అంతకంటే ముఖ్యంగా మనదేశం నుంచి ఇక ముందు నల్లధనం తరలివెళ్లకుండా చూసుకోవాలన్నారు. పెద్ద నోట్ల రద్దుతో సమస్యలన్నిటికీ పరిష్కారం లభించదని గుర్తించాలన్నారు. నల్లధనం, దాన్ని అల్లుకుని ఉన్న అవినీతిని మనదేశంలో అంతం చేయడానికి సింగిల్ ఫార్ములా లేదన్నారు. ఇందుకోసం దేశీయంగా నల్లధనం పోగుపడకుండా, అవినీతి కొనసాగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో సంస్కరణల్ని చేపట్టాలన్నారు.



"ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలందించే 'పౌరసేవల చట్టం', అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేయటం, ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని కట్టడి చేయటానికి సంస్కరణలు, రియల్ ఎస్టేట్ రంగంలో ప్రజలకు పన్నుల భారం లేకుండా భూమి విలువను పెంచటం వంటి చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో నల్లధనం మళ్లీ తయారవకుండా ఉండటానికి ఈ సంస్కరణలన్నీ అమలుచేయకపోతే ప్రధానమంత్రి తీసుకున్న సాహసోపేత నిర్ణయానికి ప్రయోజనం ఉండదు. మంచి జరుగుతుందన్న నమ్మకంతో ప్రజలు ఎంతో ఓపిగ్గా వున్నారని, దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని జేపీ అన్నారు.


కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ, నల్లడబ్బు నోట్ల రూపంలోనే కాకుండా రకరకాల రూపాల్లో ఉంటుందని, నోట్ల రద్దుతోనే సమస్య పరిష్కారం కాదని అన్నారు. వెంకటకృష్ణ పెద్ద నోట్ల రద్దును సమర్థిస్తూ, కొన్ని సమస్యలున్నా ఒక మంచి ప్రయత్నం కాబట్టి దేశ ప్రజలు ప్రభుత్వానికి మద్దతు పలకాలని సూచించారు. మోదీ నిర్ణయం మంచిదేగానీ అమలులో లోపాలున్నాయని వంశీ అన్నారు. పీఏసీ అధ్యక్షుడు మారంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, యూత్ పార్లమెంట్ కన్వీనర్ రవి రాఘవేందర్, శివ, ప్రిన్సిపాల్ జగన్మోహనరావు, అకడమిక్ డైరెక్టర్ డి.జోసఫైన్, పలువురు అధ్యాపకులు పాల్గన్నారు. తమతరంలో కంటే విద్యార్థులు ఎంతో చురుగ్గా చర్చలో పాల్గని పరిష్కారాల కోసం ప్రయత్నించారంటూ జేపీ ప్రశంసించారు.

# విద్యార్థిసంఘాలంటే బంద్‌లు, రాస్తారోకోలు కాదు



రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో పరిస్థితుల మెరుగునకు కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ అనుబంధ విద్యార్థిసత్తా తెలంగాణ విభాగం నిర్ణయించింది. ఇటీవల విద్యార్థిసత్తా రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. విద్యార్థిసంఘాలంటే బంద్‌లు, రాస్తారోకోలు కాదని, సమాజం, సమస్యలపై అవగాహన పెంచుకుని సరైన పరిష్కారంలో భాగం కావటమని, ఈ నూతన రాజకీయ సంస్కృతితోనే తాము తెలంగాణలో విద్య, ఆరోగ్యం కోసం కృషి చేస్తామని విద్యార్థిసత్తా అధ్యక్షుడు రాజీవ్ ఈ సందర్భంగా అన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ, ఏపీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు సమావేశంలో పాల్గొని సూచనలిచ్చారు.

# రెవెన్యూ చట్టాలను ఆధునీకరించాలి... సరళతరం చేయాలి




***వివిధ పోరాటాలు, నాయకుల కృషి ఫలితంగా తెలంగాణలో రెవెన్యూలో భూమికి సంబంధించి మంచి చట్టాలు వచ్చాయని, వాటిని కాపాడుకొని మరింత ఆధునీకరించి సరళతరం చేయాలని లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనటానికి పరకాలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. భూమికీ-మనిషికీ అవినాభావ సంబంధం ఉంటుందని, అది తల్లికీ బిడ్డకీ వున్న సంబంధంలాంటిదనీ పేర్కొన్నారు. అసఫ్ జాహీలు, నిజాంలు పాలించిన తెలంగాణ నేలలో స్వాతంత్ర్యానికి పూర్వమే కొన్ని మంచి చట్టాలు వచ్చి భూమిపై సాగులో వున్న రైతులకి రక్షణ కల్పించాయన్నారు. తెలంగాణ రెవెన్యూ చట్టాలలో తేవాల్సిన మార్పులపై రామ్మోహనరావు మీడియాకిచ్చిన ఇంటర్వ్యూ సారాంశం:***

(?) రెవెన్యూ చట్టాలను ఎందుకు మార్చాలి

ఒకనాడు రాచరికంలో ప్రభుత్వ ఆదాయం భూమిపై పన్నురూపంలో ఉండేది. భూమి శిస్తు ప్రభుత్వాలను నడిపేది. రైతు పండించిన పంటలో సింహభాగం ప్రభుత్వానికి శిస్తురూపంలో చెల్లించేవాడు. పండే పంటలో ప్రభుత్వం వాటా తీసుకునేది కనుక ఆనాడు భూమి రికార్డులు పకడ్బందీగా నిర్వహించేవారు. ఆదాయం కోసమే అయినా భూమి సర్వే, హద్దులు, భూ యజమాని వివరాలు అన్నీ సరిగ్గా నిర్వహించి భూ లెక్కలు సరి చూసేవారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు పట్టా లావున పోరంబోకు, గావుతాన్ ఇలా రకరకాల భూముల వివరాలు ఉండేవి. పకడ్బందీగా భూమి రికార్డుల నిర్వహణ వల్ల వివాదాలు తక్కువగా ఉంటాయి. 1985లో ఎన్.టి రామారావు సదుద్దేశంతోనే పటేల్ పట్వారీ వ్యవస్థను తీసివేసిన తర్వాత, రెవెన్యూ శిస్తును నామమాత్రంగా మార్చిన తర్వాత రెవెన్యూ రికార్డుల నిర్వహణ వెల్లవెల్లగా కునారిల్లిపోయి, ఇప్పుడు పూర్తిగా తప్పుల తడకగా మారింది.

***ఆనాడు తెలంగాణ గ్రామపాలనలో ముగ్గురు ఉద్యోగులు ఉండేవారు. పట్వారీ, మాలీపటేల్, పోలీస్ పటేళ్లుగా వీరు చెలామణి అయ్యేవారు. పట్వారీ (గ్రామకరణం) భూమి రికార్డుల నిర్వహణ చూస్తే, మాలీపటేల్ రెవెన్యూ శిస్తు వసూళ్లు చూసేవారు, పోలీస్ పటేల్ గ్రామంలో శాంతిభద్రతలు కాపాడేవారు. ఇలా ముగ్గురు ఉద్యోగులూ గ్రామానికి రక్షణ గోడలుగా పనిచేసేవారు.***

మళ్లీ దీన్ని వాస్తవంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను తిరగరాయాల్సి ఉంది.

**(?) ఫ్యూడల్ రెవిన్యూ వ్యవస్థే ఉండాలంటారా?**

పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దును తప్పుపట్టటంలా. ఆ వ్యవస్థలోని మంచిని, ఇప్పుడున్న వ్యవస్థలోని చెడునూ వదిలేసి ప్రజలకు అవసరమైన మార్పుల్ని చేయాలంటున్నాను. ఆనాడు తెలంగాణ గ్రామపాలనలో ముగ్గురు ఉద్యోగులు ఉండేవారు. పట్వారీ, మాలీపటేల్, పోలీస్ పటేళ్లుగా వీరు చెలామణి అయ్యేవారు. పట్వారీ (గ్రామకరణం) భూమి రికార్డుల నిర్వహణ చూస్తే, మాలీపటేల్ రెవెన్యూ శిస్తు వసూళ్లు చూసేవారు, పోలీస్ పటేల్ గ్రామంలో శాంతిభద్రతలు కాపాడేవారు. ఇలా ముగ్గురు ఉద్యోగులూ గ్రామానికి రక్షణ గోడలుగా పనిచేసేవారు. అదే సమయంలో గ్రామాలలో పేదలపై దౌర్జన్యాలు, భూమి సంబంధమైన లావాదేవీల్లో పేదల పక్షం కాకుండా పెద్దల పక్షం వహించటం, న్యాయ పంచాయతీల్లో జోక్యం.. ఇలా పెత్తందారీ, ఫ్యూడల్ పోకడల వల్ల ఆ వ్యవస్థను రద్దు చేయాల్సిన అవసరం ఏర్పడింది. కానీ ఆ వ్యవస్థ స్థానే మరోమంచి వ్యవస్థను పునర్ నిర్మించాల్సిన అవసరం ఉండేంది. కానీ అది సరిగా జరగలేదు. ఈ విషయాన్ని ఇంకాస్త వివరించాలంటే ఆనాడు గ్రామాలలో ఈ అధికారులు నిర్వహించిన రికార్డులు, రిజిస్టర్లు ఇప్పటికీ ఆదర్శం. కానీ అవేవీ ఈరోజు గ్రామాలలో కనిపించవు. అందుకే భూముల వివరాలకు సంబంధించి ప్రభుత్వం కూడా ప్రజలపై ఆధారపడాల్సిన దురవస్థ ఏర్పడింది.

**(?) ఆనాడు మెయింటెయిన్ చేసిన మంచి రికార్డులు ఏమిటి**

ఉదాహరణకు రోజునాంచా అంటే, గ్రామంలో ఆరోజు ఏమి జరిగింది? గ్రామానికి కొత్తవారు వచ్చారా? నేరాలు జరిగాయా? వర్షం పడింది.. ఇలా ఆరోజు గ్రామంలో జరిగిన విషయాలను రోజునాంచా 'ప్రతి దినం' రికార్డు చేసేవారు. అలాగే వర్షం రికార్డుకు బారిష్ తక్తా, పంటల వివరాలకు పైదావర్ తక్తా, భూముల రకాలు వాటి రికార్డులకు గ్రామ నక్షా, సర్వే నెంబర్లవారీ వివరాలు, రైతుకు ఆదాయంలో మొత్తంగా ఎంత భూమి ఉందో తెలిపే ఖాతాదారీ చౌఫస్లా, ఇలా సుమారు ఇరవై ఏడు రికార్డులు నిర్వహించేవారు. దాంతో గ్రామంలో కుంటలు, చెరువులు, గ్రామ ఉమ్మడి భూములు, గావుఠాక్, గ్రామకంఠం భూములు, ప్రభుత్వ ఇనాం భూములు, దేవాదాయశాఖ భూములు, గ్రామంలోని చెరువు కుంటల 'శికం' పూర్తి స్థాయి చెరువు నిండితే మునిగే పట్టా భూముల వివరాలు, ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) వివరాలు.. ఇలా భూమికి సమగ్ర సమాచారం ఉండేది. ఆనాటి సేత్వార్, ఫైసల్ పట్టీ 'కాస్రా పహాణే'లే నేటికీ భూ వివాదాలు తీర్చడానికి అవసరమైన రికార్డులుగా కోర్టు వివాదాల్లో, ఇతరత్రా అవసరాల్లో ఉపయోగపడుతున్నాయి.

**(?) మరి ఇప్పుడు ఏమి చేయాలి**

రెవెన్యూ రికార్డులలో సమగ్ర మార్పులు రావాలి. ఎపుడో నైజాంకాలంలో సర్వేచేసిన భూములను రీసర్వే చేయాలి. సరికొత్తగా రికార్డులు తయారుచేయాలి. తెలంగాణలో సర్వే చేసినపుడు మరొక అబ్‌నార్మల్ విషయం సాధారణంగా కనిపిస్తుంది. రెండు మూడు గుంటల విస్తీర్ణం గల సర్వే నెంబర్లతోపాటు వెయ్యి ఎకరాలకు పైబడి విస్తీర్ణం గల సర్వే నెంబర్లు కూడా వుంటాయి. ఆ సర్వే నెంబర్లలో ఉన్న రైతులు ఎవరు, ఎక్కడ భూములు స్వాధీనంలో ఉన్నాయనేది రికార్డుల్లో కనబడదు. దాన్ని సరిచేయాలంటే సర్వే నెంబర్ల విస్తీర్ణం తగ్గించి శాస్త్రీయంగా విస్తీర్ణాన్ని కుదించాలి. ఐదు, పది ఎకరాలకు ఒక సర్వే నెంబర్ మించకూడదు.

రెండవది, వాస్తవంగా సాగు చేస్తున్న, సాదాబైనామాలతో కొనుగోలు చేసి మ్యూటేషన్ చేయించుకోలేకపోయిన భూముల సమగ్ర సర్వే, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత గ్రామసభల్లో వివరించి నూతనంగా గ్రామ రెవెన్యూ రికార్డులను తయారుచేయాలి. ఇది నిరంతర ప్రక్రియ. భూములు ఎప్పటికీ ఉంటాయి. మనుషులే మరణిస్తారు. అందుకే సమాజం ఉన్నంత వరకూ భూమి మీద జరిగే ప్రక్రియ ఇది.

సాదా బైనామాల రిజిస్ట్రేషన్, ఎటువంటి రుసుము లేకుండా చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం సమర్థనీయం. ఇందులో అక్రమాలు చోటుచేసుకోకుండా, దళారుల ప్రమేయం లేకుండా, గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సాదాబైనామాల క్రమబద్ధీకరణ

***భూమి రిజిస్ట్రేషన్ వరకే తమ బాధ్యతంటూ ఆ తరువాత వివాదాలకు రిజిస్ట్రేషన్ శాఖ బాధ్యత వహించదు. ఇక రిజిస్ట్రేషన్ సమయంలో ఆ ఆస్తి రెవెన్యూలోగానీ, పంచాయతీ మునిసిపాలిటీలలోగానీ మార్పిడి (మ్యూటేషన్) చేయించడానికి అవసరమయ్యే 0.5 పర్సెంట్‌ను వసూలు చేసినా, మళ్లీ మనం ఆయా శాఖల్లో దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. ఇలాకాకుండా మ్యూటేషన్‌కు సంబంధించి ఆయా శాఖల నుంచి సరాసరి ఈ రికార్డులు వెళ్లాలి. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, పంచాయతీ, మునిసిపాలిటీల మధ్య సమన్వయం ఉండాలి. దీనికి రాష్ట్రంలో భూ భారతి, దేశంలో సమగ్ర భూమి సమాచార వ్యవస్థ మార్గం. దీన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదలుపెట్టి మధ్యలోనే మానేసింది.***

చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం అభినందనీయం.

అలాగే రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ తగ్గించాలి.

ప్రపంచంలో ఏ దేశంలో కూడా లేనంత రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ మనదేశంలో ఉంది. గతంలో 13శాతం వరకు ఉన్న స్టాంప్ డ్యూటీని మెల్లమెల్లగా 7.8శాతానికి తగ్గించారు. ఇది చాలదు. దీన్ని కనీసం ఐదు శాతానికి లోబడి తగ్గించాలని జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెనోవేషన్ స్కీం (జవహర్‌లాల్ పట్టణీకరణ పథకం) కింద కేంద్రప్రభుత్వమే సిఫార్సు చేసింది. అలా తగ్గించిన రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక ప్రోత్సాహకాలు ఇచ్చింది. అలా మహారాష్ట్రలాంటి రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో లాభపడ్డాయి. మహారాష్ట్రలోలాంటి సంస్కరణలు మనకు అవసరమే. మంచి ఎక్కడున్నా తీసుకోవాలిగా మరి.

రిజిస్ట్రేషన్ ద్వారా భూముల లావాదేవీలు రికార్డు చేయటానికి ఇప్పుడున్నంత స్టాంప్ డ్యూటీ అవసరం లేదు. కొన్ని దేశాలలో ఇది అసలు లేదు. మరికొన్ని దేశాలలో నామమాత్రంగా ఉంది. రెండు శాతం స్టాంప్ డ్యూటీ ఉన్న దేశాలు చాలా ఉన్నాయి. కనుక స్టాంప్ డ్యూటీని రెండు శాతానికి తగ్గించాలి.

రాష్ట్ర ప్రభుత్వం సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రకటించగానే లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 16లక్షల దరఖాస్తులు వస్తే వరంగల్ జిల్లాలోనే అందులో సుమారు నాలుగు లక్షల దరఖాస్తులు ఉండడం విశేషం. రాష్ట్రంలోని మొత్తం దరఖాస్తులలో 25శాతం ఒక్క (వరంగల్) జిల్లాలోనే ఉండడం ఈ సమస్య తీవ్రతను తెలుపుతుంది. దీనికి పరిష్కారం వెంటనే రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీలను తగ్గించటం. భూమి మార్కెట్ విలువను రికార్డులలో సవరించి పెంచాలి. దీనివల్ల నల్లధనం కూడా అదుపులోకి వస్తుంది.

భూమి మార్కెట్ విలువకు, వాస్తవంగా రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో ఉండే మార్కెట్ విలువకు చాలా తేడా ఉంది. చాలాచోట్ల పొంతన లేకుండా ఉంది. కొన్నిసార్లు మాత్రమే మార్కెట్ విలువకంటే రికార్డులలో ఎక్కువగా నమోదైన సంఘటనలు ఉన్నా అవి కొన్ని మాత్రమే.

**(?) స్టాంప్ డ్యూటీ తగ్గిస్తే ప్రభుత్వ ఆదాయం తగ్గదా**

ఇది తప్పుడు అభిప్రాయం. ప్రభుత్వాలు ఇదే అభిప్రాయంలో ఉన్నాయి. కానీ వాస్తవంగా డ్యూటీ తగ్గిస్తే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ఎలాగంటే ప్రస్తుతం ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం 'మద్యం' తరువాత రిజిస్ట్రేషన్ స్టాంప్‌డ్యూటీదే. ఇతర పన్నులు పోను ఇది ప్రభుత్వ ప్రధాన ఆదాయవనరుగా ఉంది. స్టాంప్ డ్యూటీ తగ్గిస్తే అందరూ సాదాబైనామాలు మాని రిజిస్ట్రేషన్‌కు ఎగబడతారు. ఇలా మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెరిగిన దాఖలా ఉంది. అక్కడ ఐదుశాతానికి తగ్గిస్తే ఖజానాకు ఆదాయం గణనీయంగా పెరిగింది.

అదేసమయంలో భూముల వాస్తవ విలువలు మార్కెట్‌కు అనుగుణంగా ప్రతీ రెండేళ్లకోసారి సవరించాలి. దాంతో ప్రస్తుతం భూముల రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన లావాదేవీల్లో జరిగే నల్లధనం చెలామణి తగ్గుతుంది. అలాగే నగదు లావాదేవీలు నియంత్రించి ప్రతిదీ బ్యాంకు ద్వారానే జరిగేటట్లు చూస్తే బ్లాక్‌మనీ చెలామణి బాగా తగ్గుతుంది. ఇలా ప్రభుత్వాదాయం రెట్టింపు తేలిగ్గా అవుతుంది.

ప్రస్తుతం రెవెన్యూ రికార్డులు రెవెన్యూ శాఖ చూస్తుండగా, వాటి వాస్తవ సర్వే నెంబర్ల కొలతలు నక్షలు సర్వే మరియు సెటిల్‌మెంట్ శాఖ చూస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖ రిజిస్ట్రేషన్ లావాదేవీలు మాత్రం చూసి యాజమాన్య (టైటిల్) హక్కుల విషయాన్ని కోర్టులకు, రెవెన్యూ కోర్టులకే అప్పచెబుతోంది. భూమి రిజిస్ట్రేషన్ వరకే తమ బాధ్యతంటూ ఆ తరువాత వివాదాలకు రిజిస్ట్రేషన్ శాఖ బాధ్యత వహించదు. ఇక రిజిస్ట్రేషన్ సమయంలో ఆ ఆస్తి రెవెన్యూలోగానీ, పంచాయతీ

**రెవెన్యూ శాఖను మానవీయ సంబంధంగా మార్చాలి. అంతిమంగా భూమికీ మనిషికీ ఉండే సంబంధం కాపాడాలి. అధికారులు ప్రజాసేవకులమన్న భావనతో పనిచేయాలి. పౌరుల పన్నుల డబ్బులతో నడుస్తున్న ప్రతి ప్రభుత్వం ఈ ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి.**

మునిసిపాలిటీలలోగానీ మార్పిడి (మ్యూటేషన్) చేయించడానికి అవసరమయ్యే 0.5 పర్సెంట్‌ను వసూలు చేసినా, మళ్లీ మనం ఆయా శాఖల్లో దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. ఇలాకాకుండా మ్యూటేషన్‌కు సంబంధించి ఆయా శాఖల నుంచి సరాసరి ఈ రికార్డులు వెళ్లాలి. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, పంచాయతీ, మునిసిపాలిటీల మధ్య సమన్వయం ఉండాలి. దీనికి రాష్ట్రంలో భూ భారతి, దేశంలో సమగ్ర భూమి సమాచార వ్యవస్థ మార్గం. దీన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదలుపెట్టి మధ్యలోనే మానేసింది.

**(?) సమగ్ర భూ సమాచార వ్యవస్థ అంటే**

ఇంటిగ్రేటెడ్ బ్యాంక్ ఇన్ఫర్మేషన్ సిస్టంగా పిలువబడే ఈ ప్రక్రియకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీన్ని మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదలుపెట్టింది. దీనిలో మూడు అంశాలు ఉన్నాయి.

1) మొదట గ్రామాలలో వున్న భూములను సర్వే చేస్తారు. ఆధునిక పరిజ్ఞానంతో ఈ కొలతలు తీస్తారు. గ్లోబల్ పొజిషనింగ్ (జీపీఎస్) ద్వారా ఉపగ్రహాలను ఉపయోగించుకుని విమానాలు, హెలికాప్టర్ల ద్వారా ఈ సర్వే చేపడతారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా భూమి సర్వే నెంబర్ల హద్దులను నిర్ణయించి, అక్కడ హద్దు రాళ్లను పాతిస్తారు. ఒకవేళ అక్రమంగా ఆ హద్దురాళ్లను ఎవరైనా పీకేసినా లేక ధ్వంసం చేసినా జీపీఎస్‌లోకి వెళ్లి ఇదివరకు ఎక్కడున్నదో తెలుసుకుని దాన్ని మళ్లీ అక్కడే పాతుకోవచ్చు. ఇలా భూమి హద్దులు నిర్ణయించాలి.

2) ఖరారు హక్కులు.. భూమికి సంబంధించి 'యాజమాన్యపు హక్కులు' చాలా వివాదాలకు కారణమవుతున్నాయి.

అవి నిర్ధారించడానికి గ్రామసభల ద్వారా ఆ భూమి యజమానులెవరో తెలుసుకుని రికార్డులను ఒకేసారి సవరించాలి. అవసరమైతే ఆధార్ కార్డుకు అనుసంధానం చేయాలి. కొనుగోలు, అమ్మకాలు జరిపినపుడు ఆ వెంటనే మ్యూటేషన్ సహజ ప్రక్రియగా జరగాలి. అంటే భూమి ఆ సర్వే నెంబర్‌లో ఎక్కడుందో వాస్తవంగా మన కంప్యూటర్‌లలో ఎక్కడినుంచైనా చూడగలగాలి. ఇలా పకడ్బందీగా రికార్డులు తయారుచేసుకోవాలి.

3) రిజిస్ట్రేషన్ కాగానే ఆటోమేటిక్‌గా ఆయా శాఖలలో మ్యూటేషన్ జరిగి ఈ వివరాలన్నీ రెవెన్యూ, సర్వే, పంచాయతీ, మునిసిపాలిటీలలో నమోదు కావాలి. ఇన్నాళ్లూ ఈ భూమిపై లేక ఆస్తిపై ఎవరు అసలైన యజమానో అన్నది వెంటనే ఎవరైనా తెలుసుకోగలగాలి. అప్పుడు భూ వివాదాలు కోర్టుల వరకూ రావు.

**(?) భూ వివాదాలు సమసిపోవాలంటే తీసుకోవాల్సిన చర్యలు సమగ్రంగా**

1. గ్రామాలలో భూముల రీ సర్వే శాస్త్రీయంగా చేయాలి. ఇందులో ప్రజల భాగస్వామ్యం ఉండాలి.
2. జీపీఆర్ఎస్, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం ద్వారా భూమి హద్దులు నిర్ణయించాలి.
3. రెవెన్యూ రికార్డులు ఆధునీకరించాలి. కంప్యూటరైజ్ చేసినపుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. భూ యాజమాన్య హక్కులను నిర్ణయించి కాపాడాలి.
4. రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీని 2శాతానికి తగ్గించాలి.
5. మార్కెట్ విలువకు అనుగుణంగా ఎప్పటికప్పుడు భూముల విలువను పెంచాలి.
6. సర్వే, రెవెన్యూ, స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీ, మునిసిపాలిటీ కార్పొరేషన్ల వార్డు స్థాయి సమన్వయ, సమగ్ర సమాచార వ్యవస్థ ద్వారా మార్పిడి (మ్యూటేషన్) లావాదేవీలు జరగాలి.
7. ఒక లావాదేవీ జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు ఆ సమాచారం వెంటనే వెళ్లాలి.
8. రెవెన్యూ శాఖను మానవీయ సంబంధంగా మార్చాలి. అంతిమంగా భూమికీ మనిషికీ ఉండే సంబంధం కాపాడాలి. అధికారులు ప్రజాసేవకులమన్న భావనతో పనిచేయాలి. పౌరుల పన్నుల డబ్బులతో నడుస్తున్న ప్రతి ప్రభుత్వం ఈ ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి.

# తప్పయింది .. గురజాడను గౌరవించుకుంటాం!





సాహిత్యం సమాజహితం కోసమే అని అక్షరాలా నిరూపించి 'దేశమంటే మట్టికాదు, మనుషులు' అని ఈనాటి పాలకులకూ అర్థంకాని రాజనీతిని ఏనాడో చెప్పిన గురజాడ అప్పారావు భావాలవ్యాప్తికి తన వంతు కృషి చేస్తున్న లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీని ఆ మహాకవి జయంతి సందర్భంగా సెప్టెంబర్ 21న ప్రముఖులతోపాటు ఏపీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి తదితరులు విజయనగరంలో సన్మానించారు. ఆ సమయంలో పట్టణంలోని గురజాడ ఇంటిని స్మారకచిహ్నంగా మార్చి స్ఫూర్తిదాయక దర్శనీయ స్థలంగా మార్చాలని, ఆయన కుటుంబానికి ఒక గౌరవప్రదమైన జీవితాన్నిచ్చి మంచి సందేశాన్నివ్వాలని బాబ్జీ చేసిన డిమాండ్‌ను వెంటనే అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఇదే మాట మరో సందర్భంలో చెప్పారు. కానీ ఆచరణలో పాలకులు చేసింది శూన్యం. గురజాడ ఇల్లు, ఆయన కుటుంబం దయనీయ స్థితిలోనే కొనసాగుతున్నాయి. మళ్లీ నవంబర్ 30న గురజాడ వర్థంతి కార్యక్రమానికి అదే మంత్రి విచ్చేశారు. గురజాడనే ఇంత అగౌరవపరుస్తున్న మీరు ఇక సామాన్యులకేమి న్యాయం చేస్తారంటూ గురజాడ విగ్రహం వద్ద రఘునాథరెడ్డికి బాబ్జీ, లోక్‌సత్తా నాయకులు అడ్డుతగిలారు. మంత్రితోపాటు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే గీత, జడ్పీ ఛైర్మన్ స్వాతి రాణి, ఎమ్మెల్సీలు జగదీష్, శ్రీనివాసుల నాయుడు, జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఉన్నారు. మంత్రి పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వ వైఫల్యానికి క్షమాపణ చెప్పారు. గురజాడ నివాసాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటంతోపాటు ఆయన స్ఫూర్తిని ప్రజలలోకి తీసుకెళ్లేందుకు కూడా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# విద్య, ఆరోగ్యంలో పెట్టుబడిదారీ దేశాలకూ మార్గం చూపిన క్యాస్ట్రో



క్యూబాపై, అనేక ప్రపంచదేశాలపై కూడా బలమైన ముద్ర వేసిన ఫిడెల్ క్యాస్ట్రో విద్య, ఆరోగ్యంలో పెట్టుబడిదారీ దేశాలకు కూడా మార్గదర్శకంగా వ్యవహరించారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అంజలి ఘటించారు. క్యాస్ట్రో మృతితో ఒక శకం ముగిసిందన్నారు. మనదేశంలో కమ్యూనిస్టులు ఆ రెండు కీలక రంగాలనీ నిర్లక్ష్యం చేసినా, క్యాస్ట్రో వంటి కమ్యూనిస్టుల ప్రభావంతో పలు దేశాలు ఇజాలతో సంబంధం లేకుండా నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించి వృద్ధిలో దూసుకెళ్లాయన్నారు. కానీ ఆర్థిక విధానాలు, మానవ మనస్తత్వం, స్వేచ్ఛ, సృజనాత్మకతల విషయంలో క్యాస్ట్రో, కమ్యూనిస్టులు తప్పని చరిత్ర రుజువు చేసిందన్నారు. ఉత్పత్తి యాజమాన్యం, నిర్వహణ.. గుత్తగా రాజ్యానిదేనని భావించటం, లాభమంతా కార్మికుల కష్టం ద్వారానే తప్ప ఆవిష్కరణలు, ఉత్పాదకత వల్ల కాదు అనటం ద్వారా కమ్యూనిస్టులు ఆర్థికరంగంలో విఫలమయ్యారన్నారు. ఆధునిక ఉదారవాద ప్రజాస్వామిక నిర్మాణానికి అన్ని రకాల వ్యవస్థల సాఫల్య వైఫల్యాల నుంచి నిష్పాక్షిక పాఠాలు నేర్చుకోవాల్సుందన్నారు.

# న్యాయమూర్తుల నియామకం ప్రభుత్వ బాధ్యత

ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకం ప్రాథమికంగా ప్రభుత్వం చేయాల్సిన పని అని పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పష్టం చేసింది. ఈ విషయమై రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలకు జరిగిన వక్రీకరణలను సరిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. న్యాయమూర్తుల నియామక ప్రక్రియను చేపడుతున్న కొలీజియం వ్యవస్థను రద్దు చేయడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని దాదాపు ఏడాది క్రితం సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో న్యాయ, సిబ్బంది వ్యవహారాల స్థాయీ సంఘం ఈ నివేదికను పార్లమెంటు ముందు ప్రవేశపెట్టింది.

రాజ్యాంగంలో పొందుపర్చిన న్యాయవ్యవస్థ స్వతంత్రత అంటే శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ సహా రాజ్యానికి చెందిన ఏ విభాగానికీ న్యాయమూర్తుల నియామకంలో ప్రధాన నిర్ణయ భాగస్వామ్యం ఉండరాదనే అర్థం అని గతంలో మూడు కేసులను విచారించిన మీదట సుప్రీంకోర్టు సూత్రీకరణ చేసింది. 1993 నుంచి కొలీజియం వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. న్యాయమూర్తుల నియామకాలు.. కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఉమ్మడి బాధ్యత అని, రెండు వ్యవస్థలూ సంయుక్తంగా ఈ బాధ్యతను నిర్వహించాలని, ఈ విషయంలో ఏ వ్యవస్థకూ మరో వ్యవస్థ కన్నా అగ్రప్రాధాన్యం లేదని పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పష్టం చేసింది. “సుప్రీంకోర్టు విచారించిన ‘న్యాయమూర్తుల రెండో కేసు’, ఆ తర్వాత విచారించిన కేసుల్లో ఇచ్చిన తీర్పుల ఆధారంగా రాజ్యాంగంలోని అసలు అంశానికి జరిగిన వక్రీకరణలను సరిచేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగం వెలిబుచ్చిన అసలు వైఖరిని తప్పకుండా గౌరవించాల్సిన అవసరం ఉంది. ఇందుకు తగిన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలి” అని స్థాయీ సంఘం నివేదిక పేర్కొంది.

రాజ్యాంగ సవరణ చెల్లుబాటుకు సంబంధించిన కేసులను ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనానికి బదులు కనీసం 11మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వినాలని నివేదిక పేర్కొంది.




రాజ్యాంగానికి భాష్యం చెప్పే కేసులను ఏడుగురు సభ్యుల ధర్మాసనం కన్నా తక్కువ సభ్యుల ధర్మాసనం వినరాదని సిఫార్సు చేసింది. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల కొరతను అధిగమించటానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును పెంచాలని, భారత ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు కనీస పదవీకాలాన్ని స్థిరపరచాలని సిఫార్సు చేసింది.

ప్రస్తుతం న్యాయమూర్తుల నియామకానికి అనుసరిస్తున్న వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు తిరస్కరణకు గురయిన అభ్యర్థులకు ఏ కారణంతో తిరస్కరించిందీ సుప్రీంకోర్టు కొలీజియం తెలియచేయాలని స్థాయీ సంఘం సూచించింది. కొలీజియం సిఫార్సులను స్పష్టమైన కారణాలు పేర్కొనకుండానే ప్రభుత్వం తిరస్కరిస్తుందని, ఇటువంటి సంప్రదాయాలు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని, నియామక ప్రక్రియలో అపారదర్శకతకు దారితీస్తుందని పేర్కొంది.

# రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా న్యాయమూర్తుల నియామకం

న్యాయమూర్తుల నియామక ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతుండటం పట్ల కేంద్ర ప్రభుత్వం మరోమారు అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత రాజ్యాంగంపై లోక్‌సభ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ, రాజ్యాంగ వ్యవస్థల మధ్య అధికార విభజన సమతుల్యతతో ఉండాలన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న విషయానికి అందుకు విరుద్ధమైన అర్థంలో భాష్యం చెప్పకూడదన్నారు. 'ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి.. రాష్ట్రపతి న్యాయమూర్తులను నియమిస్తారని రాజ్యాంగంలో ఉంది. దీనికి వేరు వేరు భాష్యాలను చెబుతున్నారు. ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు చేస్తే ప్రభుత్వం నియమించాలని, కొలీజియం సిఫార్సు చేయాలని, సిఫార్సులను రాష్ట్రపతి తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుందని, నియామకాల్లో ప్రభుత్వం పాత్ర ఏదీ లేదని.. ఇలా రకరకాల భాష్యాలు ముందుకు తెస్తున్నార'ని అన్నారు. ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకమన్నారు. చట్టసభలు, కార్యనిర్వాహక విభాగం, న్యాయవ్యవస్థల మధ్య అధికార విభజన జరిగిందని, ఏదీ మరొకదానికన్నా అధికం కాదని అన్నారు. న్యాయవ్యవస్థ చట్టసభో, కార్యనిర్వాహక వ్యవస్థో కాలేదని అన్నారు. రాజ్యాంగం ప్రకారం న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి ఉందని, అలాగని చెప్పి ఇతర వ్యవస్థలకన్నా ఉన్నతమైనది కాబోదని అన్నారు. ప్రజలతో ఎన్నికైన పార్లమెంట్, ఎన్నికైన ప్రభుత్వం, మంత్రి, ప్రతిపక్ష నాయకుడు ఈ వ్యవస్థలు కూడా రాజ్యాంగ మౌలిక స్వరూపాల్లో భాగాలేనని అన్నారు. చట్టసభలు తీసుకున్న నిర్ణయాలను రద్దు చేసే అధికారం ఉంది, కానీ ఏమి చేయాలో ఆదేశించే అధికారం లేదని తెలిపారు. న్యాయమూర్తుల అభిప్రాయమే అంతిమం, కానీ అది తప్పుకాకూడదనేమీ లేదన్నారు. రాజనీతిజ్ఞత, దూరదృష్టి ఉంటే ఈ మూడు విభాగాల మధ్య అధికార విభజనకు సంబంధించి ఎటువంటి మార్గదర్శకాలూ అవసరం లేదని, స్వీయ నియంత్రణ సరిపోతుందని అన్నారు. ఉన్నత న్యాయమూర్తుల నియామకాలలో రాజ్యాంగం ఆశించిన పారదర్శకతకు జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ కృష్ణయ్యర్, జస్టిస్ వెంకటాచలయ్యలతో లోక్‌సత్తా రూపొందించిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) బిల్లును పార్లమెంటు, అసెంబ్లీలు ఆమోదించినా.. జస్టిస్ కృష్ణయ్యర్‌కి వీరాభిమానులమని చెప్పుకునే సుప్రీంకోర్టు జడ్జీలే రాజ్యాంగవిరుద్ధంగా కొట్టివేసిన సంగతి తెలిసిందే.

# లోక్‌పాల్ నియామకంలో కేంద్రం జాప్యాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు

అవినీతికి వ్యతిరేకంగా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ లోక్‌పాల్ నియామకం చేయకపోవటాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. లోక్‌పాల్ నియామకానికి 2014లో పార్లమెంట్ చట్టాన్ని చేసినప్పటికీ ఇప్పటిదాకా నియామకం జరగని విషయాన్ని చీఫ్ జస్టిస్ టీఎస్ ఠాకూర్ సారథ్యంలోని ధర్మాసనం ప్రస్తావించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ చట్టం అడ్రస్‌లేని ఉత్తరంలా మారకూడదని స్పష్టంచేసింది. అన్నా హజారే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని లేవనెత్తిన అనంతరం చట్టంగా వచ్చిన లోక్‌పాల్ బిల్లులోని చాలా అంశాలను లోక్‌సత్తాయే ప్రతిపాదించిన సంగతి విదితమే. ఈ చట్టాన్ని కేవలం ఒక సవరణ సాకుతో నిరర్థకం చేయరాదని ధర్మాసనం పేర్కొంది. లోక్‌పాల్ ఎంపిక సంఘంలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నేతను కూడా సభ్యునిగా చేర్చుకోవడానికి వీలుగా సంబంధిత చట్టసవరణ బిల్లు ఇంకా పెండింగ్‌లో ఉండటం వల్ల నియామకం జరగలేదని కేంద్రం ఇచ్చిన వివరణ పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. లోక్‌పాల్ చట్టానికి సవరణలు సూచిస్తూ పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇచ్చిన నివేదిక ప్రతిని తమ ముందుంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'లోక్‌పాల్ ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేత స్థానంలో లోక్‌సభలో అతిపెద్ద పార్టీ నేతకు చోటు కల్పించటంతోపాటు మీరు (కేంద్రం) ఎక్కడెక్కడ మార్పులు (లోక్‌పాల్ చట్టంలో) అవసరమని భావిస్తున్నారో చెప్పండి' అని ప్రశ్నించింది.

# భారత్‌లో ముస్లిం లా ఖురాన్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది



ముస్లిం సమాజంలో మూడుసార్లు తలాక్ చెప్పే సంప్రదాయం క్రూరమైనదని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ముస్లిం మతంలో భార్యలు ఈ క్రూరచర్యతో ఎల్లకాలం బాధపడవలసిందేనా అన్న ప్రశ్న కోర్టును కలవరపెడుతోందని వ్యాఖ్యానించింది. తక్షణం విడాకులు ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేసే ఏకపక్ష అధికారం ముస్లిం భర్తకు ఉందనటం ఇస్లామిక్ నిబంధనలకు అనుగుణమైన వాదన కాదని స్పష్టం చేసింది. తీవ్ర కారణాలు లేకుండా ఏ పురుషుడూ కూడా చట్టప్రకారంగానీ, మతపరంగాగానీ విడాకులను సమర్థించు కోలేడు అని వ్యాఖ్యానించింది. 'భారత్‌లో అనుసరిస్తున్న ముస్లిం లా.. ప్రవక్త లేదా పవిత్ర ఖురాన్ పొందుపరిచిన స్ఫూర్తికి విరుద్ధమైన బాట పట్టింది. విడాకులపై భార్యకు ఉండే హక్కును వివరించే నిబంధనను ఇక్కడి దురభిప్రాయం నీరుగారుస్తోంది' అని జస్టిస్ సునీత్ కుమార్ అన్నారు. స్త్రీ-పురుష అసమానతను దీర్ఘకాలం కొనసాగేలా పర్సనల్ లా ఇష్టాయిష్టాలకు వదిలేయటం సమాజానికి, దేశానికి మంచిది కాదన్నారు. మూడుసార్లు తలాక్ పద్ధతి సుప్రీంకోర్టులో పరిశీలనలో ఉన్నందున ఎక్కువ వ్యాఖ్యానించబోమని తెలిపారు.


హీనా అనే మహిళ, ఆమె భర్త వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఉత్తర ప్రదేశ్ బులంద్‌షాహిర్‌కు చెందిన హీనా (23) తనకంటే 30 ఏళ్లు పెద్దవాడైన ఆ వ్యక్తిని వివాహం చేసుకుంది. అతను అప్పటికే వివాహితుడు. హీనాను పెళ్లి చేసుకునేందుకు తన మొదటి భార్యకు మూడుసార్లు తలాక్ చెప్పి ఆమెను వదిలేశాడు. తన తల్లి, పోలీసులు తనను వేధించకుండా ఆదేశాలు జారీ చేయాలంటూ హీనా కోర్టును ఆశ్రయించింది.

అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలను అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు సైతం స్వాగతించింది.

# ఓబీసీ కేంద్ర జాబితాలో కొత్తగా 15 కులాలు

ఇతర వెనకబడిన కులాల (ఓబీసీ) కేంద్ర జాబితాలో కొత్తగా 15 కులాల్ని చేర్చారు. వెనకబడిన కులాల జాతీయ కమిషన్ (ఎన్‌సీబీసీ) అసోం, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు సంబంధించి ఓబీసీ జాబితాలో మొత్తం 28 మార్పులను సిఫార్సు చేయగా.. వీటిలో 15 కులాలకు జాబితాలో చోటు దక్కింది. ఎన్‌సీబీసీ సిఫార్సులను ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఓబీసీ జాబితాలోని కులాలకు చెందినవారికి ప్రభుత్వ ఉద్యోగాలలో, పదవుల్లో, కేంద్ర ప్రాయోజిత విద్యాసంస్థల్లో కోటా ప్రయోజనాలు లభిస్తాయి. అలాగే పలు కేంద్ర సంక్షేమ పథకాలు, ఉపకార వేతనాలు వంటి ప్రయోజనాలు పొందటానికీ అర్హులవుతారని నోటిఫికేషన్ తెలిపింది.

# విస్మరించలేని ప్రభావం చో



తమిళ సంస్కృతి, సాహిత్యం, జర్నలిజాన్ని చో రామస్వామి నుంచి వేరు చేసి చూడలేమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళు లర్పించారు. చో అభిప్రాయాలతో ఏకీభవించినా, ఏకీభవించకపోయినా ఆయన ప్రభావాన్ని మాత్రం విస్మరించలేమని కొనియాడారు.

# నీళ్లివ్వలేని శంకుస్థాపనలతో నాటకాలాడతారా?



గుత్తనదీవిలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రస్తుతం నీటిసరఫరా జరుగుతున్న గ్రామాలు ఏడు. అందులో 31వేలమందికి కనీసం రోజుకు 20 లీటర్ల నీటినే సరిగా అందించలేకపోతున్నారు. అదే ప్రాజెక్టు నుంచి ఎదుర్లంక గ్రామంలో ఉన్న మూడువేల మందికి తాగునీరు ఎలా అందిస్తారు" అని రామాలయంపేటలో సంప్ శంకుస్థాపనకు వచ్చిన అమలాపురం ఎంపీ పండుల రవీంద్రబాబు, ముమ్మిడి వరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అధికారులను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు, లోక్‌సత్తా పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి రాజ్ వర్మ నిలదీశారు. రూ.43 లక్షలతో చేస్తున్న ఈ పనులతో ఎదుర్లంక మంచినీటి అవసరాలు ఎలా తీరుతాయని ప్రశ్నించారు. కనీసం గ్రామపంచాయతీలో తీర్మానం కూడా చేయకుండా, నీటి సమస్య పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక లేకుండా శంకుస్థాపన ఎందుకు చేస్తున్నారని అడిగారు. బదులుగా నిరసన వ్యక్తం చేస్తూ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనలేదు.

ఎదుర్లంక పంచాయతీ అభివృద్ధి కొరకు ఆయిల్ ఇండియా కేటాయించిన నిధులకు సంబంధించి ఈ పది ప్రశ్నలకు ఎమ్మెల్యే, ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ వారు లిఖితపూర్వకంగా సమాధానం చెప్పాలని రాజ్ వర్మ డిమాండ్ చేశారు:

1) ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం ఆర్‌డబ్ల్యుఎస్ వారు మనిషికి ప్రతిరోజు సగటున ఎంత నీరు సరఫరా చేయాలి?

2) ప్రస్తుతం గుత్తెనదీవి ప్రాజెక్టు నుంచి 31,000 మంది ప్రజలకు ప్రతిరోజూ తలసరి ఎంత నీటిని సరఫరా చేస్తున్నారు?

3) ప్రస్తుతం మురమళ్ల ప్రాజెక్టు నుంచి కేసినకుర్రు, తిళ్లకుప్ప పంచాయతీలకు చెందిన 15,171 మంది ప్రజలకు రోజూ తలసరి ఎంత నీటిని సరఫరా చేస్తున్నారు?

4) ప్రస్తుతం మురమళ్ల ప్రాజెక్టు నుంచి 5,390 మంది స్థానిక గ్రామస్తులకు ప్రతిరోజూ చేస్తున్న తలసరి నీటి సరఫరా ఎంత?

5) ఎదుర్లంక గ్రామానికి సొంత ప్రాజెక్టు కట్టుకుంటే మనిషికి రోజుకు సగటున ఎంత నీటిని సరఫరా చేయొచ్చు?

6) ఎదుర్లంకలో ప్రస్తుతం ఉన్న రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు ఊరికి ఇరువైపులా ఉన్నందున ఊరి మధ్యలో నివసిస్తున్న దాదాపు 1,000మంది గ్రామస్తులకు అవసరమయ్యే 1,00,000 లీటర్ల కెపాసిటీతో మూడవ ట్యాంకు ఎవరు ఎప్పుడు ఎక్కడ ఏ నిధులతో నిర్మిస్తారు?

7) ఎదుర్లంకలో ఉన్న రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల జీవితకాలం 30 ఏళ్లు దాటిపోయినందున వాటి స్థానంలో కొత్త ట్యాంకులు ఎప్పుడు కడతారు? వాటికి కావలసిన నిధులు ఎప్పుడు ఎవరు ఎలా సమకూరుస్తారు?

8) ఎదుర్లంకలో అంతర్గత సరఫరా కోసం 30 సంవత్సరాల క్రితం వేసిన కుండ పైప్‌లైను కూడా పాడైపోయినందున కొత్త పైప్‌లైను ఎవరు, ఎప్పుడు, ఏ నిధులతో వేయిస్తారు?

9) ఆయిల్ ఇండియా వారు ఎదుర్లంకలో తీవ్రంగా ఉన్న నీటి సమస్యకు సంబంధించి సంపూర్ణ పరిష్కారానికి 2 కోట్ల రూపాయల వరకు నిధులు ఇవ్వడానికి సిద్ధమయినప్పుడు కొత్త ట్యాంకులు, కొత్త సరఫరా పైప్‌లైన్లు వేయటానికి ఎందుకు ప్రయత్నించటం లేదు?

10) ఆయిల్ ఇండియా వారు ఎదుర్లంక పంచాయతీ పరిధిలో జరుగుతున్న పనులకుగాను ఎదుర్లంకలో ఉన్న నైపుణ్యం కలిగిన నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇస్తే, అధికార పార్టీవారు పైరవీలు చేసి సొంత కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించుకోవడం వాస్తవం కాదా?

## నల్లధనం, అవినీతితోపాటు రిజర్వేషన్లపైనా చర్యలు చేపట్టాలి



నల్లధనం, అవినీతిపై ప్రారంభించిన యుద్ధం తరహాలో రిజర్వేషన్ల వ్యవస్థ హేతు బద్ధీకరణకు కూడా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. పెద్ద నోట్ల రద్దును ప్రజలు ముమ్ముందు కూడా హర్షించాలంటే రియల్ ఎస్టేట్, ఎన్నికల రంగాల్లో కూడా సంస్కరణలు చేపట్టాలన్నారు. అలాగే రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ నిర్ణయించిన కాలపరిమితిని మించి రిజర్వేషన్లను ఇష్టారాజ్యంగా ఓటుబ్యాంకు రాజకీయాలలో భాగంగా కొనసాగిస్తున్నారని, దీన్ని సరిదిద్ది అర్హులకు రిజర్వేషన్ ఫలాలు అందేలా చూడాలని అన్నారు. ఎవరికితోచిన విధంగా వారు కులం, ప్రాంతం, మతం వంటి అంశాలను తెరపైకి తెచ్చి లబ్ధి పొందటం వల్ల దేశం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రిజర్వేషన్లతో లబ్ధి పొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులకు రిజర్వేషన్లు లేకుండా చేయాలన్నారు. రిజర్వేషన్ కులాల్లో దిగువన ఉన్నవారికే ఆ ఫలాలు అందేలా మార్పులు చేయాలన్నారు. అలాగే విద్యా రంగంలో ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల అగ్రకులాల్లో పేదలుగా కొనసాగుతున్న వారికి కూడా రిజర్వేషన్ల అవకాశాన్ని కల్పించేలా మార్పులు అవసరమన్నారు. రిజర్వేషన్లపై సమగ్రంగా చర్చించి సంస్కరణల్ని అమలు చేయకపోతే దేశ సమగ్రతను ముమ్ముందు కాపాడటం కష్టమని హెచ్చరించారు.

# ఏపీకి ప్రత్యేక హోదాపై కేంద్రం మాట తప్పకూడదు, వెనకబడిన జిల్లాలకైనా ఇవ్వాలని చంద్రబాబు ఒడగాలి .. 'హోదా దగా .. కింకర్తవ్యం?' పుస్తకావిష్కరణలో జేపీ

ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక తరగతి హోదా కల్పిస్తామన్న మాటకి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి వుండాలని, కలిపో, విడిగానో పారిశ్రామిక పన్ను రాయితీలు హోదాలో భాగమేనని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. ఆ రాయితీలు, వాటితోపాటు ఉద్యోగాలు, అభివృద్ధి వస్తాయన్న ఆశతోనే 2014 ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం, బీజేపీ కూటమిని గెలిపించారన్నారు. కేంద్రంలోని బీజేపీ ఏరుదాటాక తెప్ప తగలేసినట్టు వ్యవహరిస్తుంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం కూడా హోదా రాయితీల పట్ల ఉదాసీనంగా వ్యవహరించటం బాధాకరమన్నారు. హోదాను సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ విజ్ఞతతో అందరినీ కలుపుకుని పనిచేయాలన్నారు. విదేశాల నుంచి నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15లక్షలు వేయటం మన చేతుల్లో లేదుగానీ, రాజకీయ సంకల్పం ఉంటే ఏపీకి ప్రత్యేక హోదాను సాధించుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి హోదా ఇవ్వటానికి ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వస్తాయనుకుంటే రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా 'వెనకబడిన జిల్లాలకు హోదా' ఇవ్వమని కోరాలన్నారు.

'హోదా దగా.. కింకర్తవ్యం?' పేరుతో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం ప్రచురించిన పుస్తకాన్ని జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, స్టీరింగ్ కమిటీ సభ్యులు రాజ్ వర్మ, కూసంపూడి శ్రీనివాస్, పీపుల్ ఫర్ లోక్‌సత్తా నేత ప్రకాష్ కపిల పాల్గన్నారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, హైదరాబాద్ ఆదాయం కోల్పోతుండటంతో రాష్ట్ర విభజన సమయంలో మొట్టమొదట తానే మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదాను అసెంబ్లీలో ప్రతిపాదించానని, అయితే రాష్ట్రం మొత్తానికీ రావటం కష్టం కాబట్టి వెనకబడిన రాయలసీమకు ఇవ్వాలని కోరానని గుర్తు చేశారు. ఇదే ప్రతిపాదనను కాంగ్రెస్, బీజేపీ తీసుకుని మొత్తం రాష్ట్రానికి సాధిస్తామని పార్లమెంటులో ప్రధానమంత్రి చేత ప్రకటన చేయించాయని, ఎన్నికలలో హామీ ఇచ్చాయని అన్నారు. అయితే ఇప్పుడు ఇతర రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్రప్రభుత్వం ప్రత్యేక హోదాను పక్కనపడేసిందన్నారు. హోదాలో పన్ను రాయితీలు భాగం కాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు మాటమార్చటం పార్లమెంటరీ వ్యవస్థను, ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీయటమేనని, ఈ ధోరణి మున్ముందు ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రత్యేక హోదాలో భాగంగా పన్ను రాయితీలు ఉండటం వల్లే తమ రాష్ట్రానికి పెట్టుబడులు దెబ్బతింటాయేమోనని తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత కేంద్రానికి లేఖ రాశారన్నారు. అయితే ఏపీకి రాయితీలు ఇవ్వటాన్ని ఆమె వ్యతిరేకించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో యువతకు ఉద్యోగాలు పెరగాలంటే పారిశ్రామిక రాయితీలు కీలకమని, ఈ హామీని భావోద్వేగాలతో కాకుండా ఇతర రాష్ట్రాలను ఒడుపుగా ఒప్పించి సాధించాలన్నారు.

ఏపీలో వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకఏడు జిల్లాలతోపాటు దేశవ్యాప్తంగా 80-100 వెనకబడిన జిల్లాలకు కూడా హోదా రాయితీలు కల్పించే ప్రతిపాదన చేస్తే అది ఇతర రాష్ట్రాలకు కూడా ఆమోదయోగ్యమయ్యే అవకాశముందని జేపీ అన్నారు. ఈ పనికి ఏపీ ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని, అన్ని పార్టీలనూ కలుపుకుని కేంద్ర ప్రభుత్వాన్ని, అవసరమైతే ఇతర రాష్ట్రాలనూ ఒప్పించాలన్నారు. ప్రణాళికా సంఘం రద్దయి, జీఎస్టీ వచ్చినా వెనకబడిన జిల్లాలకు ఇలాంటి ఏర్పాటు అవసరం కాబట్టి 'వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక తరగతి హోదా'ను ప్రత్యామ్నాయంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పరిశీలించాలన్నారు. ఈ రాయితీలు ఇవ్వడానికి ప్రత్యేక హోదా అనే పేరు కాకుండా ఏ పేరు పెట్టినా ఫర్వాలేదన్నారు.

'హోదా' దగా.. కింకర్తవ్యం?' బుక్‌లెట్‌లో ఈ అంశాలన్నిటినీ వివరంగా పేర్కొన్నందున ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలని, రౌండ్‌టేబుళ్లు, ఇతరత్రా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చర్చనీయాంశం చేసి వాస్తవాలు, ఆచరణ సాధ్యమైన పరిష్కారాల పట్ల అవగాహన పెంచాలని జయప్రకాష్ నారాయణ్ పార్టీ నేతలకు సూచించారు.

# పౌర సేవల చట్టం తేవాలి.. దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక సంస్కరణల్ని అమలు చేయాలి









డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ రెండో తేదీ నుంచి ప్రదర్శనలు, రౌండ్‌టేబుల్ సమావేశాల ద్వారా ప్రజాచైతన్య కార్యక్రమాలను నిర్వహించాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో లోక్‌సత్తా మలిదశ ఉద్యమ (లోక్‌సత్తా 2.0) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ బండారు రామ్మోహనరావు పాల్గనగా, హైదరాబాద్‌లో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భీశెట్టి బాబ్జీ, కల్లూరి బాలసుబ్రమణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు. తమకు హక్కుగా రావాల్సిన సేవలకు లంచాలిస్తున్న పౌరులకు జైలుశిక్ష విధిస్తూ, లంచం తీసుకున్న అధికారులకు మాత్రం పోలీసు దర్యాప్తు నుంచి కూడా రక్షణ కల్పిస్తూ అవినీతి నిరోధక చట్టం 1988కి చేసిన దుర్మార్గపు 17 'ఎ' సవరణను వెనక్కితీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అవినీతిని అంతం చేయటానికి రాష్ట్రాల్లో లోకాయుక్తను బలోపేతం చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసేవల చట్టాన్ని అమలు చేయాలని, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి తదితర సంస్కరణల్ని తీసుకురావాలని లోక్‌సత్తా నేతలు నినాదాలు చేస్తూ కరపత్రాలు పంచారు. ❧

Best Wishes

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి
పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

ASHOK INDUSTRIES

Nagarajupalli (V Martur M Prakasam (Dt)

Devineni Srinivasa Rao,

Proprietor.



Best Wishes

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి
పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# ఆదిత్య కంటి వైద్యశాల

డా॥ గణేశుని పరశురామ్ M.B.B.S.;DO

డా॥ జి. సోహిని చంద్ర (M.B.B.S.)



# ఆదిత్య ఫ్యాషన్స్ & ఆదిత్య ఆప్టికల్స్

జి. కవితారాణి

Ph. 08647-257906 (Hospital)
08647-252667 (Resi)

R.V.S.C.V.S హైస్కూల్ రోడ్ విజయబ్యాంక్ వెనుక, చిలకలూరిపేట. 08647-252667

Posting Date 22-12-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on December 16th 2016

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి
పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# MAMU GRANITES

## Vidya Nagar, GUNTUR



Malempati Subba Rao
Managing director



Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad